# HANNA KRUPA

**Christian Devotional Monthly Magazine**

**సంపుటి : 7** **సంచిక : 1**

THE NATIONAL CHURCH OF INDIA 1958

**ప్రభువగు యెహోవాయే నాకు బలము**

## విషయసూచిక


| | | |
|---|---|---|
| నా కుటుంబము... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| బ్రాహ్మణ పూజారి..... | పరవస్తు | 4 |
| యజ్ఞము... | కీ॥శే॥ పండిట్ సి. హెచ్. ఫ్రాన్సిస్ | 6 |
| శాశ్వత రక్షణ | రెవ.డా॥కె.జోసఫ్, ఒంగోలు | 8 |
| మహాయజ్ఞము | రెవ.డా॥బి.శాంసన్, చెన్నై | |
| | రెవ.డా॥పి.జె.పంచరత్నం, నంద్యాల | 10 |
| అత్యంత ప్రియమైన అమ్మ | శ్రీమతి బి.విమలారెడ్డి, హైదరాబాద్ | 12 |
| మదర్ తెరీసా | యడవల్లి ప్రసాదరావు, హైదరాబాద్ | 14 |
| విశ్వాసంలో ఓ మెట్టు | కొడవటికంటి | 16 |
| యెహోవాయందు.... | హన్నాకృప డెస్క్ | 18 |
| బ్రదర్ భక్తసింగ్ | డా॥ పి.చంద్రశేఖరరావు | 19 |
| ఆనందం దేవకుమార్ | సాక్ష్యము | 20 |
| జూన్ నెల ప్రశ్న | హన్నాకృప డెస్క్ | 22 |
| పఠాన్ వలీఖాన్ | సాక్ష్యము | 23 |
| ప్రయాణంలో మజిలీ | కొడవటికంటి | 25 |
| సువార్తలలోని యేసు కథ | కొడవటికంటి | 27 |
| ఏదినిజం?ఏదిఅబద్ధం? | వి.శేఖర్‌రెడ్డి, నెల్లూరు | 29 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |



Founder :

**Kodavatikanti Emmanuel Rajendra,** B.A.,B.L.,

Editor :

**Nathaniel R. Kodavatikanti,** B.Th.,M.A.,(M.Phil)

Hon. Editor :

**A.N.R. Zakkam**

D.G.M., SOMA Enterprises, Rajasthan

Hon. Advisor :

**Yadavalli Prasada Rao**

D.A.O.,G.H.M.C., Hyderabad

Patrons :

**Dr. Y.S. Purushotham Reddy**

Superintendent, Rajareddy Hospital
Pulivendula

**Rev. Dr. K. Joseph**

Director, I.E.R.F. Ongole

**Rev. Dr. M.S. Santhavardhan**

Director, Good News Messengers, Guntur


### చందా వివరములు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ.150 |
| జీవిత చందా | రూ. 3000 |
| పోషక చందా | రూ. 5000 |

**ఆన్‌లైన్ అకౌంట్ నెం. : 10957294362**
**బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు**


**చిరునామా :**

ఎడిటర్, **హన్నాకృప,**
54-1-23 (A), కృపాదానంవీధి, క్లాపేట,
6వ లైను, ఒంగోలు- 1.


# హన్నాకృప

## ఆధ్యాత్మిక మాస పత్రిక

సంపాదకీయం

# నా కుటుంబము



నేను హాస్టల్లో చదివేటప్పుడు రాజు అనేవాడు స్నేహితుడయ్యాడు. అతనికి అన్నీ అవలక్షణాలే. ఒక సంవత్సరం తర్వాత హాస్టల్ నుండి పంపివేయబడ్డాడు. 15 సంవత్సరాల తర్వాత భార్యాబిడ్డలతో నా వద్దకు వచ్చాడు. ఎంతో సహాయం చేసి ఆశ్రయమిచ్చాను. అయినా అతను దొంగ తనం చేసి కుటుంబంతో పారిపోయాడు. 30 సంవత్సరాల తర్వాత అతని నెరిగిన వ్యక్తి నాకు పరిచయం అయ్యాడు. రాజును గురించి తెలిసికోవాలని 'రాజుకు ఎంతమంది మగపిల్లలు' అని అడిగాను. 'ఇద్దరు' అని చెప్పాడు. 'వారిలో ఎవరు జైలులో వున్నారు' అని అడిగాను (రాజుకు దొంగ తనం అలవాటు వుంది కనుక). 'పెద్దవాడు సైకిల్ దొంగతనం చేస్తూ పట్టుబడ్డాడు' అన్నాడు. చూశారా! రాజు పెద్దకుమారుడు జైలులో ఉండటానికి కారణం ఎవరు?

నా ప్రయాణాలలో అనేక కుటుంబాలు దర్శిస్తూ వుంటాను. కొన్ని కుటుంబాలతో చాల సాన్నిహిత్యము కలిగి వున్నాను. వారంతా హన్నాకృప పాఠకులే. హన్నాకృప పాఠకులైన కొందరి సంతానములోని వారు వివాహితులై వేర్వేరు పట్టణాల్లో కుటుంబము కలిగిన తమ సంతానమునకు హన్నాకృప పంపించమని అడ్రసులు ఇస్తుంటారు. వారిలో ఎందరు హన్నాకృప పత్రికకు ఆర్థిక సహాయం చేస్తున్నారో వారి పిల్లల కుటుంబీకులు కూడ తప్పని సరిగా పత్రికకు చందా పంపిస్తుంటారు. కాని ఉచితముగా పత్రిక పొందుటకు అలవాటుపడిన వారి పిల్లలు కూడ ఉచితము గానే పత్రిక పొందుతున్నారు. ఇందులో ఆర్థికస్థితికి ఏమీ సంబంధం లేదు. అతి పేదలైయుండి కూడా తల్లిదండ్రులను పోలి దేవుని సేవకు ఆర్థిక సహాయం చేసేవాళ్ళు దేవుని వలన ఎంతగా దీవించబడ్డారో వ్రాయనలవికాదు. యెషయా 38:19లో తండ్రులు కుమారులకు నీ సత్యమును తెలియ జేతురు.

మోషే ఇశ్రాయేలీయులతో ఆఖరుసారిగా మాట్లాడినంతసేపు కుటుంబమును గూర్చి మాట్లాడేడు. నువ్వు నివసించే యిల్లు ఎలా వుండాలి? నీ యింటి ద్వార బంధముల మీదను నీ గవునుల మీదను దేవుని వాక్యమును వ్రాయవలెను కుటుంబములోని నీ కుమారులకు వాటిని అభ్యసింప చేయాలి. అంటే ప్రాక్టీసు చేయించాలి. కుటుంబములోని పిల్లలు ఒకరికొకరు ప్రేమించుకోవటం, సహాయపడడం తర్ఫీదును తల్లిదండ్రుల ద్వారా ప్రాక్టీస్ చెయ్యాలి. ఇంట్లో కూర్చున్నప్పుడు, త్రోవలో నడిచేటప్పుడు, పండుకొనునప్పుడు, లేచునప్పుడు వాటిని గూర్చి (దేవుని గూర్చి) మాటలాడవలెను. ఇలా ప్రతి కుటుంబము నడుచుకోవాలి. ఇవి అలంకరణ కొరకు వ్రాయబడినవి కావు. వీటిని తప్పక, తప్పక ఆచరించాలి. ఆచరించకపోతే, రేపు నీ పిల్లలే నీకు శతృవులు. రేపు వారు నరకములో వుండటానికి తల్లిదండ్రులే బాధ్యులు. రాజైన దావీదు దేవుని వాక్యము చదవటం మర్చిపోయారు. కనుక మందసాన్ని క్రొత్త బండిమీద ఎక్కించి ఉజ్జా మరణమునకు కారకుడయ్యాడు.

తన బిడ్డలతో ఎన్నడూ దేవుని వాక్యమును గూర్చి మాట్లాడనందువలన తన కుమారులందరూ పాపములోను మరణములోను నడిపించబడ్డారు. ఊరియా కుటుంబాన్ని భగ్నమొనర్చిన దావీదుతో – నీ యింటి వారి మూలముననే నేను నీకు అపాయము పుట్టింతును అన్నాడు ప్రభువు.

మన కుటుంబము వలన ప్రక్కింటి వాళ్ళకి కీడు తటస్థిస్తే మన కుటుంబము నుండే మనకు కీడు ప్రారంభము అవుతుంది.

బైబిలు గ్రంథమంతా దేవుని నీతిని దేవుని తీర్పులను గురించి మాట్లాడుతున్నది. అంతా సైన్సు ప్రకారం కట్టడల ప్రకారం నడుస్తుంది. ఆదాము వద్ద నుండి నా వరకు అది మార్చబడలేదు.

ఒకడు తన ఒడిలో (ప్రక్కింటి) అగ్ని నుంచుకొనిన యెడల వాని వస్త్రము కాలకుండునా? ఒకడు (పరుని) నిప్పుల మీద నడచిన యెడల వాని పాదములు కమలకుండునా? అని సామెతలు 6:38 అడుగుచున్నది.

# బ్రాహ్మణ పూజారి సత్యాన్వేషణ



**" విహ్వ్యా గోప్తారాం మహక్యాదధిన కర్యుంతి హన్వా యాన పర్యతాసీన్ "**

'నీవు సరిగ్గా ప్రార్ధన చేయలేదు గనుక నీకు దేవుడు పాలడబ్బా ఇవ్వలేదు' అని నేను అన్నాను. వెంటనే ఆమె దిగ్గున లేచి నా దగ్గరకు వచ్చి 'మీరు సరిగ్గా ప్రార్ధించి అదేదో రప్పించరాదూ?' అని అంది. 'నేనెక్కడ నుండి తేగలను?' అన్నాను. 'తండ్రి అయినంత మాత్రాన సరిపోతుందా? బిడ్డలకు కావలసిన సమస్తము చూసుకోవాల్సిన బాధ్యత తండ్రిది కాదా? గంజి కాస్త ఉప్పు కలిపి వానికి పట్టి, మీరూ గంజి త్రాగండి' అంది. నేనేమి మాట్లాడలేదు. 'వాడు ఏడ్చి ఏడ్చి మధ్యాహ్నం వాంతి చేసుకున్నాడు. వానికి తీవ్రమైన జ్వరం' అంది. ఇవన్నీ విన్నాక నాకు మనస్సులో ఆవేదన కలిగింది. హఠాత్తుగా గతంలో 'ఒరేయ్ జాగ్రత్త సుమీ! ముష్టెత్తుకుంటావు, అయినా నాకు పూట గడవదు' అన్న మా అమ్మ మాటలు గుర్తుకు వచ్చాయి. మనస్సులో ఏదో చెప్పలేని బాధ. హృదయమంతా భారము. ఈ పరిస్థితిలో నేనేం చేయగలను? ప్రార్ధన చేయగలను. ఆఫీసు నుండి వచ్చాక బట్టలు మార్చుకో కుండానే గదిలో మోకరించాను. కొంతసేపు మౌనంగా కూర్చున్నాను. మరికొంతసేపు ఏ ఆలోచన లేకుండా ఏడ్చాను.

'ఓ యేసుప్రభువా! కరుణామయుడా! ఆలకించుము. నా రక్షకా! నీ దాసుని మొఱ్ఱను చెవియొగ్గుము. నేను చిన్నవాడనైయుంటిని. ఇప్పుడు పెద్దవాడనైతిని. నీతిమంతులు విడువబడుటగాని వారి సంతానము భిక్షమెత్తుటగాని నేను వినియుండలేదు. సర్వజీవుల కన్నులు నీవైపు చూచుచున్నవి. తగిన కాలమందు నీవు వారికి ఆహారమిచ్చుచున్నావు. నీవు గుప్పిలివిప్పి ప్రతి జీవి కోరికను తృప్తి పరచుచున్నావు. నీకు మొఱ్ఱపెట్టువారికందరికి, నీకు నిజముగా మొఱ్ఱపెట్టు వారికందరికి నీవు సమీపముగా ఉన్నావు. నీయందు భయ భక్తులుగలవారి కోరిక నీవు నెరవేర్చుచున్నావు. ఆకలిగొనిన వానికి ఆహారము దయచేయువాడవు నీవు. తండ్రీ! నీవు నీతిమంతులను ప్రేమించుచున్నావు. యేసుప్రభువని మృతులలో నుండి తండ్రి –నీవు లేపినావని నేను నా హృదయమందు విశ్వసించుట ద్వారా నేను నీతిమంతుడను కాలేదా? పశువులకును, అరచు పిల్లకాకులకును నీవు ఆహారమిచ్చుచున్నావు. ఇదిగో నీతిమంతులలో ఒకడునైన నీ దాసుడను. నేను నీకు మొఱ్ఱ పెట్టుచున్నాను. నా కుమారుడు కిరణ్‌కు ఆహార మిప్పించి నీ ఘననామమును మహిమ పరచుకొనుము' అని ఏడ్చుచూ, ఇంకనూ అనేకమైన దేవుని అద్భుత కార్యములను జ్ఞాపకం చేసుకుంటూ ప్రార్ధించాను. రాత్రి పన్నెండు గంటలకు రైల్వే డ్యూటీ సైరన్ వినబడింది. తెల్లవారేలోపు నాకు అనుగ్రహింపబడాలన్న పట్టుదలతో ప్రార్ధన చేస్తూ వున్నాను. కొంతసేపటికి ఎవరో పెరట తలుపు అతి భయంకరమైన శబ్దముతో తట్టుచున్నట్లు విన్నాను. నా భార్యబిడ్డలు నిద్రపోతున్నారు. మరలా తలుపు తట్టిన శబ్దం వినబడింది. నేను మోకాళ్ళని కళ్ళు మూసుకొని ఆ శబ్దమును గురించి ఆలోచిస్తున్నాను. ఇది నా ప్రార్ధనకు జవాబా? లేక ఎవరైన విశ్వాసులు ప్రార్ధన అవసరత కొరకు వచ్చారా? (అప్పుడప్పుడు ఆయా సంఘాలకు చెందిన విశ్వాసులు అలా అర్ధరాత్రి వచ్చి వారి ప్రార్ధన అవసరతలు చెప్పుకొని ప్రార్ధన చేయించుకొని వెళ్ళుట వాడుకలో వుండేది). లేక యేసుప్రభువే స్వయంగా వచ్చి తలుపు తడుతున్నాడా? ఎందుకు కాకూ డదు? లక్ష్మినారా యణస్వామి వారి ఆలయంలో నేను బంధింపబడియుండగా తలుపు తెరవబడలేదా? యేసుప్రభువు లోనికి రాలేదా? నాకు విడుదల కలిగించి నాతో మాట్లాడలేదా? అని గతాన్ని గుర్తుచేసుకున్నాను. మరలా తలుపు శబ్దం వినబడింది. ఆ శబ్దానికి రెబెక్కా మేలుకొని బలహీనమైన స్వరంతో 'ఏమండీ ఎవరో తలుపుతడుతున్నట్లుంది' అని అన్నప్పుడు నేను కళ్ళు తెరచి ఆమె వైపు చూశాను. నా హృదయం కనికరంతో నిండిపోయింది. సామాన్య మానవుడనైన నా హృదయమే కనికరముతో నిండిపోగా పరమతండ్రి జాలిగలవాడు. హృదయ కాఠిన్యత ఎంత మాత్రమును లేనివాడు. ప్రేమమూర్తి ఈ పసిపిల్లల దుస్థితి చూసి మౌనంగా వుండ గలడా? అని నేను దేవుని తలంచుకొనుచుండగ ఈసారి అతి భయంకరంగా తలుపు శబ్దము విని ఇద్దరం లేచి తలుపు దగ్గరకు వెళ్లి తలుపు తెరచి చూసి ఆశ్చర్య పోయాము. ప్రఖ్యాత సువార్తికుడు బ్రదర్ బ్రూస్ తలుపు దగ్గర నిలబడి వుండి 'బ్రదర్ మేమిప్పుడే సువార్త సేవ ముగించుకొని వచ్చాము. భోజనము చేస్తుండగా నా భార్య దైవాత్మచే ప్రేరేపించబడి మీ యింటికి వెళ్లి పాలపిండి ఇవ్వమని చెప్పింది' అన్నాడు. మేము

మౌనంగా వింటున్నాము. ఆయన మరలా 'మీకేదో అత్యవసరంగా వున్నట్లు మాకు తోచుచున్నది. అన్యదా భావించక ఈ చిన్న కానుకను కూడ వుంచండి' అంటూ పాలపిండితో పాటు కొంత కానుక నా చేతిలోపెట్టి ఇంట్లోకి వచ్చి ప్రార్థించి వెళ్లిపోయాడు. నేను వారిని సాగనంపి గదిలోకి వెళ్ళగా రెబెక్కా మోకరించి దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నారు. వెంటనే పిల్లవానికి పాలు త్రాగించి ఇద్దరం దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించి నిద్రపోయాము. మరుసటి రోజు ఒక విశ్వాసి తన మనుమడితో ఒక పాలడబ్బా ఇచ్చి పంపాడు. ఉదయం కాలకృత్యములు ముగించుకొని ఆ విశ్వాసి యింటికి వెళ్ళి 'అమ్మా! ప్రైజ్ ద లార్డ్ అండీ' అన్నాను. ఆమె కూడ వందనాలు చెప్పింది. 'మీరు పంపిన క్రొత్త పాలడబ్బా తీసుకున్నాను, మీరు పాల డబ్బా మాత్రమే ఎందుకు పంపారండీ' అని అడిగాను. 'పంపకూడదా?' అని అనింది. 'అబ్బే అదికాదండీ. అసలు పాలడబ్బా పంపాలని మీకు ఎందుకనిపించిందో తెలుసుకోవాలన్న కుతూహలంతో అడుగుతున్నానంతే' అన్నాను. 'మూడు రోజుల క్రితం మీరొచ్చి ప్రార్థన చేసి వెళ్ళాక పదకొండు రోజుల్నుంచి నేను రక్తవిరేచనాలతో పడుతున్న బాధ వెంటనే తగ్గిపోయింది. మీకు ఏదైనా కానుక యివ్వాలని అనుకున్నాను కాని యివ్వలేక పోయాను. నిన్న బజారు నుండి మా అబ్బాయితో పాలడబ్బా టీ కొరకు తెప్పించాను. ఆ సంగతి తెలియక మావారు మరొక పాలడబ్బా తెచ్చారు. రెండు డబ్బాలు మనకెందుకులే ఒకటి పరవస్తుగారికి పంపుదామన్న ఆలోచన కలిగి పంపించాను అంతే. ఇందులో మరే రహస్యంలేదు. అయినా మీరెందుకు అలా అడుగుతున్నారు? అంది ఆమె. అప్పుడు నేను జరిగిన సంగతంతా చెప్పి దేవుని మహిమపరచాను.

దేవునియందు విశ్వాసముంచి ఆయనను ఆశ్రయించు వారికి దేవుడు యే మేలును కొదువ చేయడు. ఇది నా విశ్వాస పరీక్షయేమో లేక నేను దేవుని ఎట్లు ఆశ్రయించుట అనునది నేర్చుకొనుటకు దేవుడు స్వయంగా తానే ఈ కార్యములు జరిగించుచున్నాడేమో. ఏది యేమైనను సరే, దేవుడన్నవాడు ఎవరైన వుంటే ఆయన యేసుప్రభువు మాత్రమే. నా గత జీవితమును నేను ఒక్కసారి స్మరణకు తెచ్చుకున్నాను. ప్రతి సంఘటనలో, ప్రతి కార్యములో, ప్రతి చోటా యేసుప్రభువు మాత్రమే నాకు ప్రత్యక్షమై సహాయము చేసెనని మీరింత వరకు ఇందులో గుర్తించగలిగియున్నారు. వేరొక దేవుడు వున్నచో యేసుప్రభువుకు బదులు ఆయనే నా ఎదుటకు వచ్చి వుండవలసినది. భారతదేశములో విగ్రహారాధికులు అనేకులు కలరు. అయినను వారిలో ఏ ఒక్కరైనను నా యొద్దకువచ్చి నాకు సహాయం చేయునట్లు యే దేవుడును వారికి ప్రేరేపించ లేదు. నేను చెప్పకుండానే దైవ సంతానమైన యేసుప్రభువు యందు విశ్వాసముగలవారు దైవాత్మ ద్వారా ప్రేరేపించబడి దైవనిర్ణయం ప్రకారం దైవదాసుడనైన నాకు సహాయము చేయుటకు ఆ ప్రభువు తన్ను ఆరాధించు విశ్వాసులకు మాత్రమే ఆ ఆధిక్యత అనుగ్రహించెను. దేవుడు వారిని వారి కుటుంబమంతటిని పరలోక దీవెనలతో వర్ధిల్లజేయునుగాక!

ప్రియ పాఠకులారా! మీరు నన్ను ఇలా అంటారేమో! 'ఒకవేళ మీరు రామునిగాని, కృష్ణునిగాని లేక హనుమంతుని గాని లేక మరియే బాబానైనను ఆ ప్రార్థన చేసియుంటే మీకు సహాయం లభించి యుండేదో లేదో తెలుసుకొని యుండే వారు'. అవును, నిజమే నేను ఒకసారి తెలుసుకొంటిని లక్ష్మినారాయణస్వామి వారి గర్భగుడిలో నేను బంధించబడి యుండగా దేవుడంటూ ఎవరైన వుంటే నన్ను విడిపించాలని మొఱ్ఱపెట్టునప్పుడు ఎవ్వరూ రాలేదు. నేనొక ప్రశ్న మిమ్మల్ని అడుగుతాను. నేను ఆపదలో వున్నప్పుడు నన్ను విడుదల చేయడానికి వాళ్ళంతా ఏమయ్యారు? అంతదూరం పోనేల? ఆ లక్ష్మినారాయణ స్వామి ఆలయంలో గర్భగుడిలో తలుపు అవతల నేను, లక్ష్మినారాయణస్వామి వున్నాము. సేవచేసిన వాడనే కదా! కేవలం ఒక అంగుళం మందం వున్న తలుపు ఒక్కటే ఆయనకు నాకు అడ్డము. ఆయన నన్ను విడిపించి వుండాల్సింది. కాని అలా జరగలేదు. ఎందుకు జరగలేదు. అంటే అసలు ఆయన దేవుడుకాడేమో (అదొక లోహ విగ్రహము మాత్రమే). ఇది నేను నా అనుభవపూర్వకంగా మీతో చెప్తున్నాను. ఇది కథ కాదు. లేక ఎక్కడో పూర్వము నుండి చెప్పుకొనుచున్న చరిత్రకాదు. ఇది నా సజీవ సాక్ష్యము. కేవలం నేటికి సుమారు 22 సంవత్సరాల క్రితం జరిగిన యథార్థ సంఘటన ఇది. ఇంతమంది దేవుళ్ళుండగా కేవలం యేసుప్రభువు ఒక్కరికే నాపైన వర్ణింపశక్యముకాని ప్రేమ కలిగినది. ఎందుకనగా దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను అని బైబిల్లో వుంది. ఆ ప్రేమించిన దేవుడైన యేసు ప్రభువు మాత్రమే నేను విడుదల పొందిన రాత్రి ఆకలిగొనియుండగా మార్గమధ్యంలో నాకు ఎదురై త్రాగుటకు పాలిచ్చెను. అంతేగాక నేనాశ్రయించవలసిన గృహము యేసుప్రభువునందు నమ్మకము గలవాని గృహమందు మాత్రమే నాకాశ్రయము చూపెను.

# యజ్ఞము



పండిత సి.హెచ్. ఫ్రాన్సిస్

అయితే ఆయా బలులు "రాబోవువాటి ఛాయగలవేగాని, నిజ స్వరూపము క్రీస్తులో యున్నది" (కొలస్స 2:17). ఎందుకనగా "యజ్ఞోవా అవతి తస్య ఛాయ క్రియతే" అనగా యజ్ఞమే రక్షించుచున్నది; దాని నీడ జరుపబడుచున్నది అని గ్రహింపవలెను. సూర్యుడు ఉదయించు వరకు ఆయా దీపములను మనుజులు వెలిగించెదరు. కాని, సూర్యోదయానంతరము వెలిగింపరు. రాత్రులందు సూర్యుడున్నను భూమి గుండ్రముగా యున్నందున దాని అగ్ని అన్ని భాగములలో వెలుగు ఒకేసారి ప్రకాశింపదు. అలాగే నీతి సూర్యుడగు క్రీస్తు మొదట ప్రాచ్యులగు తూర్పు దేశీయుల వారికిని, అటు తరువాత పశ్చిమ దేశీయులకును తన సువార్త ప్రకాశమును ప్రసరింపజేసెనని తెలియుచున్నది. ఆయనకు పక్షపాతము లేదు.

యేసుక్రీస్తు పురాతన కాలము మొదలుకొని శాశ్వతకాల పర్యంతము ప్రత్యక్షమగుచుండెను (మీకా 5:21). అయితే కాలము సంపూర్తియైనప్పుడు ఆయన కన్యయు స్త్రీయునగు మరియకు జన్మించి మానవులు స్వీకృత పుత్రులు కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్నవారిని విమోచించుటకై తాను కూడ ధర్మశాస్త్రమునకు లోబడెను. లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను (కొలస్స. 4:4,5; 1కొరింథి. 15:3,4).

క్రీస్తు మృత్యుంజయుడు గనుక తనను నమ్మిన వారిని విమోచించుటకు నిరంతరము జీవించుచున్నాడు. 'నిత్యుడగు ఆత్మ ద్వారా తనను తాను నిర్దోషిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము నిర్జీవ క్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మనస్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధిచేయును' (హెబ్రీ. 9:14).

కావున 'క్రీస్తు మరణించిన తరువాత పాపులను ఎవరు ఉద్ధరిస్తున్నారు?' అని ఆర్య సమాజమువారు ప్రశ్నించుట నిరర్థకమైయున్నది. మరియు వారు –'క్రైస్తవులు పాపులైన అగుదురుగాక క్రైస్తవులు కాని వారు మాత్రము పాపులుగారు' అని వ్రాయుట అసత్యము. ఎందుకనగా– 'కామ క్రోధ వశాస్సర్వే దేవషిన్ పిత్రు మానవాః' అనగా దేవతలు, పిత్రు దేవతలు మానవులందరు అరిషడ్ వర్గములగు కామక్రోధాదులకు వశమైన వారేనని హిందూ మత గ్రంథములు ఘోషించుచున్నవి. కనుక–

'పాపోహం, పాపకర్మహం, పాపాత్మ, పాపసంభవః త్రాహిమాం కృపయా దేవ శరణాగతిః వత్సలా దయనియోమ ధన్యోస్మి, తవకో అత్రజగత్రయే' అని భారతీయుడు ప్రార్థించుచున్నాడు. అనగా, ఓ దేవా! నేను పాపిని, పాపము చేయుచున్నాను. పాపములో పుట్టితిని, పాపాత్ముడను నన్ను రక్షింపుము. నీవు కృపగలవాడవు. మూడు లోకములలో నీ యెదుట దయను పొందవలసినవాడనగు నేనున్నాను. మరియు 'అన్యధా శరణం నాస్తిత్వమేవ శరణం మమ పాపినామ్ అహమేవ అగ్రే, దయాళూనామే త్వంఅగ్రణీః' అనియు ప్రార్థించుచున్నాడు. అనగా – వేరొక దిక్కులేదు. నీవే నాకు దిక్కు; పాపులలో నేను మొదటివాడను, దయగలవారిలో నీవు అగ్రగణ్యుడవు. కాబట్టి, ఆర్యులేమి అనార్యులేమి పాపులేయని ధర్మశాస్త్రములు ప్రతిపాదించుట సత్యము సుమా! ఆర్యులు ఈశ్వర పుత్రులనియు, అమృత పుత్రులనియు, వారు పాపులు కారనియు నేటి ఆర్యసమాజము వారు చెప్పుచున్నారు. అయితే ఆర్య ఋషులేమని ప్రార్థించిరో ఋగ్వేదము సాక్ష్యమిచ్చుచున్నది గమనించుడు–

1. మంత్రము –

అవతే హేళోవరుణ నమోభిరవ యజ్ఞేభిరీ మహేహావిర్భిః
క్షయన్న సభ్య మసుర ప్రచేత రాజన్నేనాంపి శిశ్రథఃకృతాని॥

**భావము :** ఓ రాజగు వరుణా, నీ కోపమును నమస్కారములతో పోగొట్టుకొనుచున్నాము. అనిష్టము తొలగించునట్టి అధిక ప్రజ్ఞగల యో వరుణా! మాకొరకిచట నివసించుచు మేము చేసిన పాపములను వదలింపుము. (ఋగ్వేదము 1వ మండలం, 6వ అనువాకం, 24వ సూక్తం, 257వ ఋక్కు).

2. మంత్రము

మనో మహంతముత, మానే ఆర్భకం
మాన ఉక్షంతము తమాన ఉక్షితః ।
మానోవధీః పితరం మోతమాతరం మానః
ప్రియస్తన్వో రుద్రరీరిషః ॥

(యజుర్వేదము 16వ అధ్యాయం 15వ మంత్రం)

అనగా ఓ రుద్రా, దుఃఖరూపములగు పాపఫలము లిచ్చుచు దుష్టులను ఏడ్పించు పరమేశ్వరా! నీవు మాయందలి చిన్నపెద్దలను గర్భమును, తల్లిదండ్రులను, ప్రియులను, బంధువర్గమును, శరీరులను చంపుటకు మమ్ములను ప్రేరేపిం పకుము. నీ దండనకు పాత్రులము గాకుండునట్టి మార్గము లందు మమ్ములను నడుపుము.

3. యథానో మిత్రో వరుణో, యథా రుద్రచ్చ కేతలి।
యథా విశ్వేశ జోషసహా ॥ (ఋగ్వేదము 1-42-3)

తాత్పర్యము : మిత్రుడు (సూర్యుడు), వరుణుడు, రుద్రుడు (శివుడు) సమాన ప్రీతిగల సర్వదేవతలు మమ్ములను అనుగ్ర హించుట యెటులనో తెలిసికొందురుగాక!

4. శ్లో॥ ఇద్రియాణాంచ సర్వేషాం, యద్యేకం క్షరతీంద్రియమ్।
తేనాస్యక్షరతి ప్రజ్ఞాద్రుతేః పాదాది ఓదకమ్ ॥
(మనుస్మృతి రెండవ అధ్యాయం, 99వ శ్లోకం)

అనగా- తోలు సంచిలోని నీరంతయు (దానికిగల నాలుగు కాళ్ళలోని) ఒక కాలు కట్టు విప్పినంతనే కారిపోయిన రీతి. ఇంద్రియములలో నొక ఇంద్రియము విషయాసక్తమైన యెడల అన్ని ఇంద్రియముల (కర్మేంద్రియములగు - చేతులు, కాళ్ళు మొదలగు వాని యొక్కయు జ్ఞానేంద్రియములగు చెవులు, కన్నులు, ముక్కు నాలుక, చర్మముల యొక్కయు) సంబంధమైన బుద్ధి వ్యవస్థ లేక పాడైపోవును.

5. దేవి భాగవతము, షష్టమస్కంధము, 10వ అధ్యాయలో
శ్లో॥ పాపం కరోతి మనుజస్తథా దేవాద యోపిచ।
తథా నారాయణో రాజన్నరశ్చధర్మ జావుభౌ॥
జాతౌ కృష్ణార్జునే కామం శౌనారాయణస్యసౌ।
పురాణ పీఠికేయం వైమునిభిః పరికీర్తి తౌ॥

తాత్పర్యము : ఓ రాజా, మనుష్యులు పాపము చేయు చున్నారు. అలాగే దేవతలును పాపము చేయుచున్నారు. ధర్ముని పుత్రులగు నారాయణుడు, నరుడుయను ఋషులును అటులే పాపము చేసినందున వారు నారాయణుని అంశవలన కృష్ణార్జునులై పుట్టిరి. ఇది మునులచే చెప్పబడిన పురాణ పీఠికయందున్నది; అని వ్యాస మహర్షి చెప్పెను.

పైన వ్రాయబడిన ప్రమాణ వాక్యముల వలన ఈశ్వర పుత్రులని, అమృత పుత్రులని చెప్పబడిన ఆర్యులు, ఋషులు, మునులు, తపోధనులందరు పాపాత్ములేయని ఋజువగు చున్నది. బైబిలులో కూడ 'మనమాయన సంతానమని మీ కవీశ్వరులలో కొందరు చెప్పుచున్నారు. కాబట్టి మనము దేవుని సంతానమైయుండి మనుష్యుల చమత్కార కల్పనల వలన మలచబడిన బంగారము, వెండి, రాతినైనను దేవత్వము పోలియున్నదని తలంపకూడదు. ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచిచూడనట్టుగా ఉండెను. ఇప్పుడైతే అంతట అందరు మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞా పించుచున్నాడు... మృతులలో నుండి క్రీస్తును లేపినందున దీని నమ్ముటకు అందరికి ఆధారము కలుగుజేసియున్నాడు' అని వ్రాయబడియున్నది (అపొ.కార్య.17:26-31).

**పాతనిబంధనలోని ప్రవచనములు - క్రొత్త నిబంధనలో వాటి నెరవేర్పు :**

1. ముప్పది రూకలకు క్రీస్తు అమ్మబడుట (యిర్మీ.32:6-9) ఇస్కరియోతు యూదా క్రీస్తును ముప్పది రూకలకు అమ్ముట, తిరిగి యిచ్చుట (మత్తయి 26:14-16; 27:3-5).

2. ఖడ్గమా! నా గొఱ్ఱెల కాపరి మీదను నా సహకారి మీదను పడుము; ఇదే యెహోవా వాక్కు. గొఱ్ఱెలు చెదరిపోవునట్లు కాపరిని హతము చేయుము (జెకర్యా 13:7).

యేసు వారితో - నేను అనుదినము దేవాలయములో కూర్చుండి బోధించునప్పుడు మీరు నన్ను పట్టుకొనలేదు. అయితే ప్రవక్తల లేఖనములు నెరవేరునట్లు ఇదంతయు సంభవించెనని చెప్పెను. అప్పుడు శిష్యులు ఆయనను విడిచి పారిపోయిరి (మత్తయి 26:55,56).


**పాఠకులకు గమనిక**

ఈ సంవత్సరము (2008) నుండి పత్రిక 32 పేజీలకు పెంచడమైనది. సంవత్సర చందా **150/-** రూపాయలకు పెంచడమైనది. మేము పంపించే పత్రిక 90% మందికి ఉచితంగా వెళ్తుంది. ఈ పత్రిక ఉచితంగా పొందుతున్న వారిలో ఎక్కువ మంది అన్యజనులే. అంటే చందా పంపించే కొద్దిమంది ద్వారానే ఈ పత్రిక నడిపించ బడుతుంది. క్రమం తప్పకుండా చందా పంపే వారు మా సాహిత్య సేవలో మమ్ములను అర్థం చేసుకుని మాతో సహకరిస్తున్నందుకు వారికి మా కృతజ్ఞతలు. చందా పంపదలచిన వారు మా యొక్క బ్యాంక్ (S.B.I.) ఆన్‌లైన్ అకౌంట్ నెం. **10957294362** ద్వారా పంపవచ్చును. కనుక పాఠకులు గమనించ ప్రార్థన.

# శాశ్వత రక్షణ

## (రక్షణ యొక్క శాశ్వత భద్రత)

కీలకమైన ఈ సంగతుల దృష్ట్యా ప్రతి విశ్వాసి యొక్క రక్షణ భద్రపరచబడియున్నదని ఋజువు చేసే స్పష్టమైన వాక్యభాగాలను పరిశీలిద్దాం. ఏదేను తోటనుండి బహిష్కరింపబడిన ఆదాము స్వరూపమందు పాప స్వభావముతో మనము జన్మించాము (ఆది. 5:3; 6:11-12). అయితే తన స్వరూపమందు తన పోలిక చొప్పున తన చేతులతో చేయబడిన మానవుడు నశించిపోవుట దేవుని చిత్తము కాదు. దుష్టులు మరణము నొందుటచేత నాకేమాత్రమైన సంతోషము కలుగునా? వారు తమ ప్రవర్తనను దిద్దుకొని బ్రతుకుటయే నాకు సంతోషము (యెహె. 18:23) అని సెలవిచ్చిన దేవుడు మనలను నశింపజేయడు. నశింప జేయటము సాతానుని వుద్దేశము. సర్వకాల జ్ఞానముగల ఆది అంతములేని దేవుడు జగత్తు పునాది వేయబడక ముందే ఈ రక్షణ ప్రణాళికను క్రీస్తుయేసులో సంకల్పించి సిద్ధము చేశాడు (ఎఫె. 1:4,5). అందుకే సాతానుడు ఆదాము ద్వారా మరణము తెస్తే దేవుడు తన మహాకృపలో క్రీస్తునందు మనలను మరలా జన్మింపజేసి (అంతమాత్రమేకాక) సాతాను కార్యమును త్రిప్పికొట్టాడు. దేవుడు తన ప్రియ కుమారుడైన క్రీస్తునందు ఆత్మ సంబంధమైన శక్తిగల ప్రతి ఆశీర్వాదమును మనకు అనుగ్రహించాడు (ఎఫె. 1:3). ఆదిమ గ్రీకు భాషలోని మూలవాక్యములో ఈ మాట వ్రాయబడినది. దీనికి వివాదంలేదు. ఈ ఆశీర్వాదము భూమి మీద మన జీవన ప్రయాణంలో క్రమంగా నెరవేరబడుతుంది. అయితే యుగాంతములు చూడగలిగిన దేవుని దృష్టిలో అన్ని నెరవేరియున్నవి. అంటే మన రక్షణ కార్యక్రమము పూర్తయి వున్నదన్నమాట. జగత్తు పునాది వేయబడక ముందే రక్షణ కార్యక్రమం సిద్ధం చేయుట రక్షణ కార్యక్రమము పూర్తయియున్నవి. మొదలగు సంగతులు మన జ్ఞానమునకు మించినవి కాబట్టి వాటి విషయం మనం బుర్ర బద్దలు చేసికొనకూడదు. నమ్మటమే మన వంతు.

అసలు తండ్రియైన దేవుడు మనలను శాశ్వతముగా క్రీస్తునందు పదిలపరచాడు (1కొరిం. 1:30). ఇక మనం నశించేదెక్కడ? పరమ తండ్రి మనలను జగత్ పునాది వేయబడక ముందే ఏర్పరచుకున్నాడు. ఏ సహాయము నిరీక్షణ లేని వీధుల వెంట తిరిగే పిల్లలు కొన్నిసార్లు రక్షింపబడి, ప్రేమ ఆదరణ చూపే ఇండ్లలో చేర్చబడినట్లుగా క్రీస్తు ద్వారా మనలను తన కుమారులగుటకు ముందుగానే (జగత్ పునాది వేయబడక ముందే) దేవుడు నిర్ణయించుకున్నాడు (ఎఫె. 1:4-6). కుమారత్వమనగా మనము ఏ స్వరూపములో సృష్టించబడినామో ఆ క్రీస్తు యేసు స్వరూపములోనికి ఆత్మీయమైన పరిపక్వములో రూపాంతరము పొందుట (ఆది. 1:26,27). ఇది మనము ఎంతో సంతోషించవలసిన విషయము. బాగా ఆలోచించండి. ఎందుకంటే జగత్ పునాది వేయబడక ముందే దేవుడు మనలను తన కుమారులుగా ఏర్పరచుకొనుటలో ఆనందించాడు. దేవునికి స్తోత్రము కలుగును గాక! సృష్టికర్తయైన దేవుడు తన చిత్తానుసారముగా తన సంకల్పము చొప్పుననే సమస్తము చేయుట ఇక్కడ మనము చూస్తున్నాము (ఎఫె. 1:5). 'నా ఆలోచన నిలుచును, నా చిత్తమంతయు నెరవేర్చుకొనెదననియు' మరియు 'నేను చేయగా ఆటంకపరచు వాడెవడు?' అని యెష. 46:10లో దేవుడు సెలవిస్తున్నాడు. సర్వశక్తిగల దేవుడు జగత్ పునాది వేయబడక ముందే శాశ్వతమైన రక్షణలో ఏర్పాటు చేసుకొొటని, తన స్వరూపములో నిర్మించి, వారి కొరకు తన కుమారుని సైతము బలిగా అర్పించి సంపాదించిన తన జనాంగమును పోగొట్టుకుంటాడు అని చెప్పుట అజ్ఞానము, అవివేకము, అవిశ్వాసము కాదా?

దేవునితో కూడా ఉండే మహా భాగ్యమంతటిని వదలి ఆకాశ మహాకాశముల నుండి దిగి, మహిమ స్వరూపమును వదిలి, ఎన్నికలేని మట్టి శరీరము ధరించి, రిక్తునిగా, దాసునిగా ఈ లోకములో జీవించి మూడున్నర సంవత్సరాలు తన శాంతి మార్గములతో మానవులను ఉత్తేజపరచి, పాపులచేత అవమానించబడి, పిడిగుద్దులు గుద్దించుకొని, అరచేతులతో కొట్టించుకొని, కొరడాలతో కొట్టించుకుంటూ వీధుల వెంట సిలువ మోసి, ఉమ్మి వేయించుకొని, తాను మోసిన సిలువ మీదే, ముళ్ళ కిరీటముతో మూడు సీలల మీద వ్రేలాడి తన గొర్రెల కొరకు (మన రక్షణ కొరకు) ప్రాణము పెట్టిన యేసు (దేవుడు) తన అమూల్యమైన రక్తమును ఇచ్చి మనలను సంపాదించుకొనిన యేసు, మనలను పోగొట్టుకుంటాడు అని చెప్పుట అవివేకం కాక ఏమవుతుందో మీరే చెప్పండి

(యోహా. 10:28). అంటే మన యేసు తన అమూల్యమైన రక్తమునిచ్చి సంపాదించుకొనిన మనలను సైతాను వచ్చి దొంగిలించి పోతుంటే ఊరుకుంటాడా? శక్తివంతుడైన యేసుని అలా ఊహించుకొనుట సిగ్గుకరం. దేవుడు కొందరిని నాశనమునకు నిర్ణయిస్తాడా? అని కొందరు ప్రశ్నిస్తారు. పరిశుద్ధ గ్రంథములో దీనికి జవాబు వుంది. చెవులు గలవారు విందురు గాక! దేవుడు ప్రేమయై యున్నాడు. 'కుమారుని యందు విశ్వసించువారు నశింపక నిత్యజీవం పొందునట్లుగా ఆయన తన అద్వితీయ కుమారుని అనుగ్రహించెను (యోహాను 3:16). దేవుడు నీతిమంతుడు దుర్మార్గుడు తన దుర్మార్గతలో నశించుట దేవునికిఇష్టంలేదు.

ఏ ఒక్కరూ నశించుట ఆయనకు ఇష్టం లేదని పేతురు వ్రాశాడు. కనుక దేవుడు కొందరిని నాశనమునకు ముందుగా నిర్ణయిస్తాడు అని చెప్పుట వివేకము అనిపించుకోదు. ఆదాము స్వభావంలో జన్మించిన వారు ఈ లోకములో తమ జీవితమును ఏ విధంగా నడిపించుకుంటారో అనేదాని మీద వారి భవిష్యత్తు ఆధారపడి వుంటుంది. ఈ విషయంలో సాతాను తోటలో హవ్వను మోసం చేసిన విధంగా మనకు సందేహం కలుగజేస్తూ దేవుని మీద అభాండములు వేస్తూ వుంటాడు. అటువంటి సందేహములకు తావియ్యక మన పట్ల అపారమైన ప్రేమ కలిగిన దేవుని సందేహింపక ఆయన మనకు కలుగజేసిన రక్షణయందు నమ్మిక వుంచుదాం. మనము నశించిపోవుట ఆయనకు ఇష్టము లేదు. కనుకనే జగత్ పునాది వేయబడక ముందే మనలను ఏర్పాటు చేసుకొని క్రీస్తులో భద్రపరిచాడు. అంతమాత్రమే కాక ఆయన కృపకు పాత్రులుగాను, ఇష్టులుగాను మనలను చేసుకున్నాడు (ఎఫె. 1:6). ప్రభువు నందు విశ్వసించిన ప్రియులారా! ఈ క్రింది ఉదహరణను ఒకసారి ఆలోచించండి. మీ హృదయములో యోచించుడి. పరిశుద్ధుడైన తండ్రికి, కుమారుడైన క్రీస్తు బహు ప్రియుడు. ఆయనను ఎల్లప్పుడూ అంగీకరిస్తాడు. ఆయనలో మనము ఉన్నాము కనుక మనము కూడా అంగీకరించబడ్డామన్న మాట. ఉదా: దేశాధ్యక్షుని ఆఫీసులోనికి ముందుగా అనుమతి లేకుండా ఎవరూ రాకూడదు. మన దేశానికి రాజేంద్రప్రసాద్ గారు అధ్యక్షులుగా ఉన్నప్పుడు జయప్రకాష్ నారాయణ అనే గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు రాజేంద్రప్రసాద్‌గారికి ప్రియమిత్రుడుగా వుండేవారు. ఆయన ఒకసారి రాజేంద్ర ప్రసాద్‌గారిని చూడవలసి వచ్చింది. ఈ జయప్రకాష్‌గారికి ఆయనను కలిసికొనుటకు ఎల్లవేళల ప్రవేశం వుంది. అపాయింట్‌మెంట్ అవసరం లేదు. ఉదయం 10 గంటలకు జయప్రకాష్ నారాయణగారు అధ్యక్షుడైన రాజేంద్రప్రసాద్‌గారి ఆఫీసుకి తనతో ఒక ఆరుగురుని తీసుకొని వెళ్ళాడు. అప్పటికే ఆఫీసు ముందు చాలామంది అధ్యక్షుని కలవడానికి చాలా సేపటి నుండి వేచియున్నారు. కాని జయప్రకాష్ నారాయణ గారు తన ఆరుగురు సహచరులతో నేరుగాలోనికి వెళ్ళి పోయాడు. అప్పుడు అంతకు ముందు నుంచే అక్కడ వేచియున్నవారు ఆ గేటు దగ్గర వ్యక్తిని ఇదేమిటయ్యా అని అడిగారు. అప్పుడు ఆ కాపలాదారుడు రాజేంద్రప్రసాద్‌గారు జయప్రకాష్ నారాయణగారిని అన్నివేళలా అంగీకరిస్తాడు (లోపలికి రానిస్తాడు). ఆయనతో వచ్చిన వారికి కూడా ఆయననుబట్టి ఏ ఆక్షేపణ లేకుండా అంగీకరిస్తాడు అని చెప్పాడు. అలాగే తండ్రియైన దేవుడు మనలను క్రీస్తులో వుంచాడు (1కొరింథి. 1:30). క్రీస్తు మనలను తనలో ఉంచు కొని తండ్రి దగ్గరకు వెళ్ళాడు. మన జీవము ఆయన యందు భద్రపరచబడి యున్నది (కొలస్సి. 3:3). క్రీస్తు యేసు కల్వరిలో మరణించుట ద్వారాను, పునరుత్థానము ద్వారాను తండ్రి అయిన దేవుడు మన విషయమై సమాధాన పరచబడ్డాడు (1కొరింథి. 5:18). కనుక క్రీస్తుతో మనలను అంగీకరిస్తాడు. అలాగే క్రీస్తు మాట దేవుడు వింటాడు. ఆయన ద్వారా వెళ్ళే ప్రతి మనవి దేవుడు వింటాడు.

యోహాను 11:42లో 'నీవు ఎల్లప్పుడును నా మాట వినుచున్నావని' అని కుమారుడైన క్రీస్తు తండ్రితో అన్నాడు. కనుకనే మనము క్రీస్తు ద్వారా చేసే మనవులన్నీ కూడ ఆయన అంగీకరిస్తాడు. ఆ విధంగా తన సంకల్పము చొప్పున మనము పరివర్తన కలిగి రూపాంతరము పొందిన బిడ్డలుగా దేవుని మహిమపరచుటకు ఆయనే మనలను ఏర్పరచు కున్నాడు. కనుక ఆయన రక్షణలోనే మనము ఉన్నాము. ఆనాడు ఇశ్రాయేలీయులను తన కొరకు ప్రత్యేక జనాంగంగా ఏర్పాటు చేసికొనినట్లు ఈనాడు క్రీస్తునందు విశ్వాసులు క్రీస్తునందు తండ్రియైన దేవునికి శాశ్వత బహుమానముగా ముందుగానే ఏర్పరచబడ్డారు. ఈ పూర్వ నిర్ధారణ దేవుని శాశ్వత చిత్తానుసారమే జరిగినది (ఎఫె. 1:10-12). ఇదియుగాక విశ్వసించు మనము పొందబోవు సంపూర్ణ రక్షణకు వాగ్దానం చేయబడిన స్వాస్థ్యము పొందుటకు సంచకరువుగా ఇవ్వబడి మనలో ఇప్పుడు నివసించుచున్న పరిశుద్ధాత్మలో మనము ముద్రింపబడియున్నాము (ఎఫె. 1:14).

సీరియల్

# మహా యజ్ఞమ్

4

**యేసుక్రీస్తు – మనుష్య కుమారుడు పురుషోత్తముడు**

బైబిల్ గ్రంథంలోని క్రొత్త నిబంధనలో ప్రభువైన యేసుక్రీస్తు, ఆయనే మనుష్య కుమారుడు (మనుజ రూపంలో వున్న దైవకుమారుడు) అని, అనేక పర్యాయాలు ఉద్ఘాటించారు. మత్తయి సువార్త 16:13–16 ప్రకారం 'మనుష్య కుమారుడెవరు?' అని ప్రజలనుకుంటున్నారని కూడా అడిగాడు. అందుకు సీమోను పేతురు 'నీవు సజీవుడవగు దేవుని కుమారుడైన క్రీస్తువని చెప్పాడు. మత్తయి 17:5 ప్రకారం యేసు ఎత్తైన కొండమీద ఏకాంతముగా వెళ్ళి రూపాంతరం పొందిన సమయంలో 'దేవుడు, ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు. ఈయన యందు నేను ఆనందించు చున్నాను. ఈయన మాట వినుడి' అని పలికాడు. అయితే ఆ మరుక్షణమే వారు కొండనుండి దిగి వస్తుండగా యేసు, శిష్యులతో 'మనుష్య కుమారుడు మృతులలో నుండి లేచువరకు ఈ దర్శనం మీరెవరితోనూ చెప్పవలదని' తెలిపాడు (9వ వచనం).

యేసుక్రీస్తు, తన కార్యాచరణం మహాయజ్ఞం గురించి ప్రస్తావించినప్పుడెల్లా, మనుష్యకుమారుడను నేనే అని తెలిపాడు. మత్తయి 20:28లో 'అలాగే మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని ఉపచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకు వచ్చెనని' చెప్పెను.

బైబిల్లోని పాత నిబంధన గ్రంథంలో దానియేలు ప్రవక్త తన దర్శనములో ఈ మనుష్య కుమారుని గురించి దానియేలు 7:13 ప్రకారం, 'రాత్రివేళ నా దర్శనంలో, మనుష్య కుమారుడు ఆకాశ మేఘాల నుండి వచ్చి నా యెదుట నిలుచుండుట, నేను చూచాను' అని తెలిపాడు. యేసుక్రీస్తు కూడా ప్రధాన యాజకుల ప్రశ్నకు సమాధానంగా మత్త.26:64లో 'ఇది మొదలుకొని మనుష్య కుమారుడు సర్వశక్తుని కుడి పార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు, మీరు చూతురని' చెప్పెను. 'పురుష' అని అర్థానిచ్చే 'మనుష్య కుమారుడు' అను మాటను అధికారాయుతంగా యేసే ఉపయోగించాడు. ఆయన పనిని నెరవేర్చడానికి యేసు లోకంలో ఈ మాటను ఉపయోగించాడు.

'పురుష' అంటే మానవ కుమారుడని తెలిపే విషయాలు కొన్ని : మనుష్య కుమారుడుగా ఆయన నెరవేర్చవలసిన కార్యము గురించి ఆయన అరుదెంచెను. పాతనిబంధనలో కీర్తనలు, యెహెజ్కేలు గ్రంథాల్లో (పురుష) మానవుడు అంటూ, మహిమోన్నతుడైన మనుష్య కుమారుడు అని పేర్కొనబడింది. అయితే, ఆయన శ్రమలు పొంది మహిమను అనుభవిస్తాడని వ్రాయబడింది. ఇక్కడ పురుష అంటే మానవుడు అని గ్రహించాలి.

పురుష, పురుష సూక్త, ఋగ్వేదానికి హృదయం అనవచ్చు. ఋగ్వేదంలోని పదవ మండలం, తొమ్మిదవ అధ్యాయం, పాపరహితం, పరిపూర్ణ సర్వాంతర్యామి పురుషను గూర్చి పద్దెనిమిది విశేషమైన వచనాల్లో వివరింపబడింది. పురుషసూక్తలోని ఈ అంశాలు సామ, యజుర్, అధర్వణ వేదాల్లోను వున్నాయి. సర్వ సృష్టి, స్వర్గప్రాప్తి ఈ మహాయజ్ఞ ఫలితమేనని వేదాల ప్రకటన. ఆదికాలంలోనే ఈ సిద్ధాంతం స్థాపింపబడింది. పారంపర్య హిందూధర్మం, వేదాల్లోని ఈ పురుష అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వుంది. పూజలు, పునస్కారాలు, మతాచారాలు, పురుషసూక్త శ్లోకాలను వల్లించటంతో ప్రారంభింపబడుతాయి.

పురుష సూక్త పాఠ్యాంశం రెండు భాగాలుగా విభజించుకోవచ్చు.

1. 'పురుష' యొక్క ఔన్నత్యం.
2. 'పురుష' యొక్క పరిత్యాగం.

పురుష యొక్క గాంభీర్యత :

శ్లోకం : సహస్ర శిరసా – పురుష
సహస్రాక్షా, సహస్రాపథ్
స భూమిమ్ విశ్వతో వృత్వా
అత్య తిస్ట ద్దా సాంగుళం

**భావం :** పురుషునకు వేయి శిరసులున్నాయి. వేయి కన్నులున్నాయి, వేయి పాదాలున్నాయి. సర్వభూస్థలిని వ్యాపించియున్నాడు. ఆయనే పరిపాలిస్తున్నాడు. ఆయన తనను దశాంగుళాలలో అమర్చుకున్నాడు.

అంగుళములు = (వ్రేళ్ళు) = దశాంగుళాలకు అతీతమైన వాడని కూడా భావం.

ఈ అత్యద్భుతమైన పురుషుడు మానవాతీతమైన స్థాయిలో ప్రశంసింపబడినాడు. వేయితలలున్న వాడు, వేయి కళ్ళున్నవాడు, వేయి పాదాలున్నవాడు, ప్రజ్వరిల్లే ప్రకాశకుడు. భూదింగతముల్లో వ్యాపించిన వాడుగా ప్రశంశింపబడినాడు.

వేయి శిరములన్నవాడు గనుక అన్నీ తెలిసినవాడే, వేయి నేత్రధారుడైనందున, అన్నిటినీ చూస్తాడు. వేయి పాదాలతో ఎక్కడికైనా వెళ్తాడు. పవిత్ర బైబిల్ గ్రంథంలోని యెహెజ్కేలు ప్రవక్త దేవుని వైభవాన్ని పదవ అధ్యాయంలో అభివర్ణించిన విధంగా, ఈ పురుష ప్రశంస అమరి వున్నది. మహిమ పూరితమైన కెరూబుల సమూహాన్ని ప్రవక్త వీక్షించాడు. యెహె. 10:12 ప్రకారం కెరూబుల పూర్ణ శరీరం, వారి వీపులు, చేతులు, రెక్కలు అనేకమైన కన్నులు కలిగి వున్నాయి. వారి నాలుగు చక్రాలు కూడా నేత్ర పూరితాలే. యెహెజ్కేలు లెక్కింపలేనన్ని కళ్ళను చూశాడు. అదే విధంగా పురుషసూక్త రచయిత, యోగి పుంగవుడు పురుషలో వేయి కళ్ళను చూశాడు. ఆ ఋషి సరిగ్గా వెయ్యి కళ్ళను లెక్కించాడని భావంకాదు. సహస్రోపేత నేత్రాలు అని గణించాలి. మరికొన్ని ప్రాముఖ్య సంగతులు:

1. సృష్టికర్త ఒక పురుషుడు (మానవాకృతిని ధరించినవాడు)
2. పురుష: ఈశాన లేదా ఈశ్వర (మహాదేవుడు) పురుషోత్తముడు

ఆయన అన్ని దేవతలకు దైవం. సర్వసృష్టికి అధిపతి సమస్తమును జయించిన వాడు. ఈ వాక్యాంశంలో పురుషుని దైవత్వం, మానవత్వం చాల తేటగా తెలుస్తున్నాయి.

వెయ్యి కళ్ళు, వెయ్యి కాళ్ళు వున్న ఏదో ఒక సామాన్య మానవుని గూర్చి వైదిక, ఋషులు అభివర్ణించడంలేదు. ఆ వర్ణనలని. పురుష సూక్తానుసారం ఈ లక్షణాలు 'మనిషి'లో చూడవచ్చు. దేవుడే మానవుడై భూమండలంలో జన్మించడంతో, ఈ సంఘటన నెరవేరింది. దైవావతారమే యేసు అని గ్రహించిన పరిశుద్ధ పౌలు 'యేసు అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆది సంభూతుడై వున్నాడు' అని కొలస్సి. 1:15లో తెలిపాడు. హెబ్రీ. 1:2లో దేవుడు, తన కుమారుని సమస్త మునకు వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను. కుమారుడైన యేసు, దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్త్వము యొక్క మూర్తిమంతమునైయుండి, తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచు పాపముల శుద్ధీకరణ తానే చేసి, దేవదూతలకంటే ఎంతో శ్రేష్టమైన నామమును పొంది అతిశ్రేష్టుడై ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండెను. ఏలయనగా – 'నీవు నా కుమారుడవు నేడు నేను నిన్ను కనియున్నాను అనియూ, నేను ఆయనకు తండ్రినై ఉందును, ఆయన నాకు కుమారుడై వుండును. మరియూ ఆయన భూలోకమునకు ఆది సంభూతుని, మరలా రప్పించినప్పుడు దేవుని దూతలందరూ ఆయనకు నమస్కారము చేయవలెనని' చెప్పుచున్నాడు (హెబ్రీ. 1:2–6).

యోహాను సువార్త ఆరంభంలోనే అద్భుతమైన దైవావతారం గురించి వ్రాయబడింది (యోహాను 1:1–14). 'ఆదియందు వాక్యముండెను వాక్యము దేవుని వద్ద వుండెను. వాక్యము దేవుడైయుండెను... (14) ఆ వాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను. తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి'.

ఆ మహోన్నత దైవం పవిత్రుడు, పాపరహితుడు. ఇది మార్పుచెందని ఆయన స్వభావమును మనం యేసులో చూడగలం. యేసులో పాపంలేదు. నిష్కళంక పురుష (పాపం లేని మనిషి)ని గురించి ఋషులు కన్న కల ఇదే.

'సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సకల సృజనముకన్న మహాగొప్ప వాడైన దేవుడు. పురుషరూపంలో తనకు తానే అలా పదివ్రేళ్ళ ప్రమాణానికి అమర్చుకున్నాడు'. పురుష మహత్వాభి వర్ణనను మరో శ్లోకంలో చూద్దాం.

'పురుష ఎవిదం, సర్వం
యద్భూతం, యక్కాభయం
ఉతామిత్రా త్వసయే సానో
యదన్నే నా త్రియోహతో'

భావం : 'ఈ సర్వసృష్టి పురుషాత్మకమే. ఉనికిలో వున్నది, ఉనికి కానున్నది అన్నీ ఆయనే. శాశ్వతానికి ప్రభువు ఆయనే. సహజ ఏర్పాట్లతో ఆయనే పోషకుడు'. సృష్టికాలాల అతీతుడు. నిత్యత్వానికి ప్రభువు. ఆది, అంతము ఆయనే. బైబిల్లోని ప్రకటన గ్రంథంలో దేవుని మాట, 'అల్ఫయు ఓమెగయు నేనే (అంటే ఆదియు, అంతము నేనే). వర్తమాన, భూత, భవిష్యత్కాలాలలో వుండువాడను నేనే' అని సర్వాధికారియు, దేవుడును అగు ప్రభువు సెలవిచ్చు చున్నాడు. (1:8) ఈ వాక్యం యేసుక్రీస్తుకు వర్తించటం అద్భుతమైన విషయం.

నిత్యత్వం లేదా శాశ్వత జీవమునకు ప్రభువే ఈ పురుష యేసు మాటలు 'నా ఇష్టమును నెరవేర్చుకొనుటకు నేను రాలేదు. నన్ను పంపిన వాని చిత్తమును నెరవేర్చుటకే పరలోకము నుండి దిగి వచ్చితిని, ఆయన నాకనుగ్రహించిన దాని అంతటిలో నేనేమియు పోగొట్టుకొనక, అంత్యదినమున దాని లేపుటయే, నన్ను పంపినవాని చిత్తమైయున్నది. కుమారుని చూచి ఆయనయందు విశ్వాసముంచు ప్రతి వాడును నిత్యజీవము పొందుటయే, నా తండ్రి చిత్తము. అంత్యదినమున నేను వానిని లేపుదును (యోహా. 6:38–40).

సీరియల్

3

# అత్యంత ప్రియమైన అమ్మ

## (దేవుని బలిష్టమైన చేతిలో దీనపాత్ర కీ.శే. శ్రీమతి వై.యస్. జయమ్మ)

మా తల్లి అనుదినం మేము బైబిలు చదవాలని, ప్రతి ఆదివారం ఆలయానికి వెళ్ళాలని, క్రమంగా జరిగే కుటుంబ ప్రార్థనలకు రావాలని ఎంతో ఖచ్చితంగా నొక్కి చెప్పేది. ఈ విషయాల్లో మేమందరం మా తల్లికి భయపడేవారం. ఎన్నడూ మేము ఆమెను నిరాశపరచలేదు. మా తండ్రి సహితం ఆమె దైవభక్తికి భయపడేవారు. ఆమెను ఎన్నడూ నిరాశపరచకుండుటకు తన శాయశక్తులా ప్రయత్నించేవారు. పేదరికం రూపుమాపాలని, పట్టణంలోని యౌవనస్తులను క్రమశిక్షణలో పెట్టాలని మరియు తన కుమారుడు ముఖ్యమంత్రి కావడం చూడాలని నా తండ్రి కలలు కన్నాడు. ఆ కలలు నెరవేరుటకు ప్రతీసారి మా అమ్మ ఆయనను ప్రోత్సహించేది. ఎంతగానో ప్రార్థించేది 'విస్తారమైన మాట లలో దోషముండక మానదు తన పెదవులను మూసికొను వాడు బుద్ధిమంతుడు' (సామెతలు 10:19) అను వచనాన్ని మా అమ్మ నమ్మింది. దేవుని వాక్యం ప్రకటించే విషయంలో తప్ప ఆమె ఎక్కువ మాట్లాడేది కాదు.

ఆ రోజుల్లో ప్రజలు కుల వ్యవస్థ గురించి ఎంతో పట్టింపుతో వుండేవారు. మాకందరికీ జీవిత భాగస్వాములను వెదకవలసి వచ్చినప్పుడు, ఎంతో కష్టంగా వుండేది. ఎందు చేతనంటే అప్పుడు యేసుప్రభువును నమ్మిన రెడ్డి కులస్థులు ఎక్కువగా లేరు. వివాహం క్రైస్తవ పద్ధతిలో జరగాలని మా తల్లి ఎంతో పట్టుదలతో వుండేది. క్రైస్తవులే తనకు కోడళ్ళుగా రావాలని ఆమె కోరింది. అయితే కోడళ్ళందరు మరియు అల్లుడు హిందువులుగా వున్నప్పటికీ వివాహ సమయంలో వారు క్రైస్తవులైనారు.

ఆలయానికి, లేక కుటుంబ ప్రార్థనలకు హాజరు కావాలని ఏ కోడలిని ఆమె ఎన్నడూ బలవంతం చేయలేదు. అయితే వారు యేసుక్రీస్తును తెలుసుకోవాలని ఎల్లప్పుడు దేవునికి ప్రార్థన చేసేది. ఆమె ప్రేమనుబట్టి, ప్రార్థనలబట్టి వారందరు క్రమంగా మారిపోయారు. ప్రస్తుతం వారందరు భక్తిగల క్రైస్తవులు. మా తల్లి మమ్ములను పెంచిన విధంగా వారందరు తమ పిల్లలను పెంచారు. మనుమలు, మనుమ రాండ్రందరు ఆమెను ఎంతగానో ప్రేమించారు.

నా వదినలు మరియు మరదళ్ళు వారి తల్లుల కంటె మా తల్లిని ఎక్కువగా ప్రేమించారు. ఆమె ప్రేమ మరియు దీనత్వం గురించి చెప్పటానికి అనేక సంఘటనలు వారి దగ్గర వున్నాయి. ఆమె నిరంతర ప్రార్థనలతో వారినందర్నీ క్రీస్తు చెంతకు నడిపించింది. ఆమె వారందరికీ మాదిరి. నేను ఆమెకు ఏకైక కుమార్తెను అయినప్పటికీ నాకూ వారికి మధ్య ఎన్నడూ తేడా చూపేది కాదు. ఏదైనా ప్రార్థనా కూడికలకు లేక ఉత్సవాలకు మా బంధువులను లేక సంఘ కాపరులను ఆహ్వానించాలని ఆమె అనుకున్నప్పుడు వ్యక్తిగతంగా వారి గృహాలకు వెళ్ళి, వారిని ఆహ్వానించేది. ఇంకొకరైతే వారిని ఫోను ద్వారా ఆహ్వానిస్తారు. అది ఆమె దీనత్వానికి గుర్తు. ఆమె దీనత్వం ద్వారా మేము ఎంతో నేర్చుకున్నాం. సంతోష మైనా లేక విచారమైనా ఆమె చూపే నిగ్రహానికి మేమెంతో ఆశ్చర్యపడేవారము. ప్రతి విషయానికి ఆమె ప్రభువు మీద ఆధారపడేది కాబట్టి ఆ విధంగా వుండేది.

ఆమె ఎన్నడూ తన కొరకు బట్టలు కొనుక్కునేది కాదు. ఆమె ధరించుకొనుటకు కోడళ్ళందరూ ఆమెకు చీరలు కొని తెచ్చేవారు. ఆమెకు ఎటువంటి ప్రత్యేకమైన యిష్టాయిష్టాలు లేవు. ఆమె సామాన్యమైన తేలికపాటి చీరలు మాత్రం ధరించేది. తన కొరకు ప్రత్యేకంగా అది కావాలి యిది కావాలి అనే కోరికలు ఆమెకు లేవు కాబట్టి ఆమెకు ఏమైనా బహుమానాలు కొనడం చాలాకష్టంగా వుండేది. మేమందరం దైవభక్తికి సంబంధించిన కొన్ని చిన్న పుస్తకాలు ఆమె కొరకు కొనేవారం. ఇంకా రకరకాల సైజుల్లో సిలువలు, దేవుని వాక్యం వుండే అలంకాల వస్తువులు కొనేవారం.

నా పిల్లలు యువరాజ్ మరియు దివ్య మొదటి మూడు సంవత్సరాలు మరియు పాఠశాల సెలవులు ఆమెతో గడిపారు. అప్పుడు ఆమె ప్రభావం వారి మీద గొప్పగా పడింది. పడుకునేటప్పుడు ఆమె చెప్పిన బైబిలు కథలన్నీ యింకా జ్ఞాపకం వస్తున్నాయని యువరాజ్ నాకు చెప్తుంటాడు. యువరాజ్ కుమారుడు దేవరాజ్ సహితం ఆమెను ఎంతో ప్రేమించాడు.

మా అమ్మ మమ్మును విడిచి పరలోకం వెళ్లినప్పుడు

దేవరాజ్‌కు వయసు నాలుగు సంవత్సరాలు మాత్రమే 'ఆమె కాళ్ళు పట్టుకొని, నేను కూడ అవ్వతో (నా తల్లితో) దేవుని దగ్గరకు వెళ్లి వుండవలసింది' అని పదే పదే చెప్పేవాడు. దేవరాజ్‌కు ఆమె లేని లోటు తీరనిది. ఆ రకమైన ప్రేమ ఆమె పంచింది, తిరిగి పొందుకుంది. మా తల్లి తనకు 'ఆత్మీయ మార్గదర్శి' అని నా కోడలు స్రవంతి చెపూ్త వుంటుంది. ఆమె మా అమ్మ దగ్గర నుండి ఎన్నో మంచి విషయాలు నేర్చుకుంది. పిల్లలు, మనుమలు మరియు మనుమరాంద్రందరూ మా అమ్మ స్వార్థంలేని వ్యక్తి అని గుర్తించారు. ఆమె చుట్టూ వున్న ప్రజల బాగోగులు గురించి ఎల్లప్పుడు ఆలోచించేదని భావించారు.

యిల్లు విడిచి పనులకు బయటకు వెళ్ళబోయే ముందు ఆమె దగ్గరకు వెళ్లి ప్రార్థన చేయించుకునే అలవాటు కుటుంబ సభ్యులందరికీ వుంది నా తండ్రి ఎన్నో ప్రయాణాలు చేసేవారు. ఆయన ఎన్నడూ కూడా ఆమె ప్రార్థనలను నిర్లక్ష్యం చేయలేదు. ముఖ్యమంత్రి అయిన మా అన్న సహితం తన జీవితంలో ఏదైనా ప్రాముఖ్య కార్యము చేయుటకు ముందు తాను ఎంత పని తొందరలో వున్నప్పటికీ ప్రార్థన చేయించుకొనుటకు మా అమ్మ దగ్గరకు వెళ్ళేవాడు.

అమెరికాలో వున్న నా కుమార్తె దివ్య, ఏదైనా సమస్య లేదా విచారంలో వున్నప్పుడు, ఆనందం కలిగినప్పుడు అనేకసార్లు ఫోనులో నా తల్లిచే ప్రార్థనలు చేయించుకునేది. గురివిరెడ్డివంటి మా తండ్రి స్నేహితులు సహితం ఏదైనా ఒక ప్రాముఖ్యమైన పనికి వెళ్ళబోయే ముందు మా తల్లి దగ్గరకు వచ్చి ప్రార్థన చేయించుకునేవారు. మేమంతా ఆమె ప్రార్థనల మీద ఆధారపడేవారం. దేవుడు ఆమె ప్రార్థనలు తక్షణమే వింటాడని మా నమ్మకం. అయితే మేమందరం ఆమెవలె ప్రార్థనా యోధులుగా మారాలని ఆమె కోరేది. ఆమె మమ్మును విడిచి వెళ్ళిన తరువాత మాత్రమే ఆమె కోరికలోని గొప్పతనం గ్రహించగలిగాను. ఇప్పుడు ఈ మార్పుతో ఆమె నన్ను చూసినట్లయితే ఎంతో సంతోషించేది. ఎందుచేతనంటే ఇతరుల గురించి ప్రార్థించాలనే ఆమె భారం నేను స్వీకరించాను. ఏలియా ఆత్మ ఎలీషా మీదకు దిగినట్లుగా, మా తల్లి ప్రార్థనా భారం నాకు వచ్చింది. పరిశుద్ధాత్మతో నేను నింపబడుటకు ప్రభుని పాదాల చెంత మా తల్లి ప్రార్థిస్తూ వుంటుందని నా నమ్మకం. నేను ప్రభువునందు సంతోషం కనుగొన్నాను. దేవుని కృప మా మీద వుంది. దేవుని రాజ్యం కొరకు పని చేయుటలో నా పిల్లలు మరియు నేను గొప్ప ఆనందం కనుగొన్నాము. గణపవరంలో నా కుమారుడు యువరాజ్, నాతల్లి జ్ఞాపకార్థం (వై.ఎస్.జయమ్మ మెమోరియల్ చర్చి) ఆలయం కట్టించాడు. ఇప్పుడు అక్కడ అనేకమంది దేవుని దగ్గరకు నడిపించబడుతున్నారు.

మా తల్లి మా కుటుంబం గురించి మరియు ఇతరుల గురించి ఎంతో సమయం ప్రార్థనలో గడిపేది. అయితే ఒకసారి మాత్రం మేము, మా గ్రామ ప్రజలందరు ఆమె గురించి ప్రార్థించే అవకాశం కలిగింది. 1995వ సంవత్సరంలో ఆమె తీవ్రంగా జబ్బు పడింది. అప్పుడు ఆమెకు శస్త్రచికిత్స జరిగింది. ఆ సమయంలో ఆమె బాత్ రూమ్‌లో పడిపోయి తలకు గట్టిదెబ్బ తగలటం వలన స్పృహలేని స్థితిలోకి వెళ్ళిపోయింది. అప్పుడు దేవుని కృపను బట్టి మా మూడవ అన్న వై.ఎస్. వివేకానందరెడ్డి ఇంట్లోనే వున్నాడు. ఆయన వెంటనే మా తల్లిని హైదరాబాద్‌కు తీసుకొని వెళ్ళాడు. హైదరాబాద్‌లోని వైద్యులు ఆమెకు వైద్యం చేయలేకపోయారు. అక్కడ నుండి వెంటనే ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఆసుపత్రికి తీసుకొని వెళ్లవలసి వచ్చింది. ఆ కృపనుబట్టి మా రెండవ అన్న వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆ సమయంలో పార్లమెంట్ సభ్యుడు కాబట్టి తన పలుకుబడితో మా తల్లిని వెంటనే ఆ ఆసుపత్రిలో చేర్చగలిగాడు. అక్కడ వైద్యులు మా తల్లికి శస్త్రచికిత్స చేయాలని తీర్మానించారు. ఆసుపత్రిలో మా తండ్రితో వున్న మా తమ్ముడు సుధీకర్‌రెడ్డి ఆ రాత్రి శస్త్రచికిత్స చేయుటకు ముందు వైద్యులు ఏ విధంగా వెనుకాడారో నాకు చెప్పాడు. అప్పుడు వైద్యులకు సహితం మా తల్లి బ్రతుకుతుందన్న నమ్మకం ఏ మాత్రం లేకుండా వున్నారు. ఆమె నాడి కదలికలో మరియు రక్తప్రసరణలో హెచ్చుతగ్గులు అధికంగా వున్నాయి. వైద్యం చేయుటకు ఆమె చాల బలహీనంగా వుందని వైద్యులు చెప్పారు.

ఎంతో గుండె ధైర్యం మరియు బలంగల మా తండ్రి సహితం అప్పుడు ఏడవడం ప్రారంభించాడు. మా ఎడతెగని ప్రార్థనల వలన, మా విశ్వాసము వలన శస్త్రచికిత్స నిర్ణయించిన సమయానికి కొన్ని గంటలకు ముందే ఆమె పరిస్థితి కుదుటపడింది. అప్పుడు వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి ముందు వెళ్ళగలిగారు.

(సశేషం)

# మదర్ తెరీసా



ఆమెకు ఆజ్ఞాపింపబడినట్లుగా ఆమె కాన్వెంట్‌ను వదలి పేదవారితో జీవించుట ద్వారా వాళ్ళలో ప్రతి ఒక్కరికి చేయు సేవ క్రీస్తు ప్రభువుకు చేస్తున్నట్లు ఆనందించుటే తన భాగ్యము. ఇది తనకు ప్రభువు పిలిచిన పిలుపులో పిలుపు. కాని నాలుగు గోడల మధ్య వున్న తను ఎలా చేయగలదు. ప్రభువుకు ప్రార్థన చేసింది. ప్రభువా, నేను కాదు చేసేది, చేయగలిగేది నీవే. నా భారము యావత్తు నీపైనే.

మదర్ తెరీసా అచంచలమైన విశ్వాసము ఎన్నడూ సన్నగిల్లలేదు. ఆమె నిజమైన విశ్వాస మహిళగా నిరూపించు కొనినది. అబ్రాహాము దేవుని వాగ్దానాన్ని నమ్మెను. ఆయన పిలుపుకు లోబడినాడు. అబ్రాహాము శోధింపబడి విశ్వాసమును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను. మృతులను సహితము లేపుటకు దేవుడు శక్తివంతుడని యెంచినవాడై, తన యేక కుమారుని అర్పించి ఉపమాన రూపంగా అతనిని మృతులలో నుండి మరల పొందెను. అటులనే కన్యయైన మరియ దేవుని మాటను విశ్వసించెను. ఆ మాట చొప్పున నాకు జరుగునుగాక అని తనకున్న శ్రేష్టమైన విశ్వాసాన్ని ప్రకటించుకొనినది. మదర్ తెరీసా యేసుప్రభువు పిలుపును విశ్వసించి పరిశుద్ధాత్మ నింపుదలతో ముందుకు సాగింది. దేవుడు దయచేయు వాడు అనునని ఆమె విశ్వాసము. ఎన్ని ఇబ్బందులు, అడ్డంకులు కలిగినను యేసుప్రభువు వైపు చూస్తూ ఆయననే సమాధాన కర్తయని విశ్వసించినది. ప్రభువు ప్రణాళికలో వున్న విషయా లకు మార్గము చూపేది దేవుడే. లోబడి ముందుకు సాగే బాధ్యత మనది. కనుక ఏ విషయములోను చింత పడనవస రము లేదు అని విశ్వసించి ముందుకు సాగింది. నిజ విశ్వాసం నిర్జీవముగా వుండక బహు శక్తివంతమైనదిగా వుంటుందని మదర్‌కు తెలుసు. ఆ విశ్వాసమే హృదయానికి నిశ్చయతను కలుగచేస్తూ ముందుకు సాగిస్తుంది. దేవుని దృష్టిలో మానవ చరిత్ర అంటే ఆయనలో నమ్మకం వుంచిన వారి చరిత్ర నమ్మకమూ. అది సాధించిన కార్యాలే శాశ్వతంగా నిలిచేవి కాబట్టి అది ప్రాముఖ్యమైనది. లోకంలో మిగతాదంతా గతించిపోతుంది. నమ్మకం వెలుగును లోపలికి రానిచ్చే కన్నువంటిది. మదర్ తెరీసా జీవితం పైవిధమైన నమ్మకముతో కూడినదని ప్రపంచానికంతా తెలుసు.

డార్జిలింగ్ నుండి కలకత్తాకు తిరిగి వచ్చిన తరువాత తన పిలుపును గురించి ఫాదర్ సెలెస్ట్ వాన్ ఎగ్జెమ్‌గారికి తెలియపరిచింది. ఆ విషయమును విన్న ఫాదర్ ఎగ్జెమ్ ఆశ్చర్యపోయాడు. ఇంత చిన్న మహిళ కలకత్తా వీధులలో అంతటా రక్తసిక్తముగా వున్న పరిస్థితులలో పనిచేయుట ఎంత కష్టతరమని తలంచాడు. మదర్ తెరీసాతో మరి కొంత కాలము ప్రార్థనలో గడిపి ప్రభువును అడుగవలసిందిగా సలహా ఇచ్చాడు. మదర్ తెరీసా రిట్రీట్‌లో పరిశుద్ధాత్మ నడిపింపుతో తను తెలుసుకున్న విషయాలన్నీ తనకు కలిగిన ప్రేరణ, పిలుపు గురించి అంతా వ్రాసి ఆ పేపర్స్‌ను ఫాదర్‌కు అందజేసింది. ఆమె ఒక చీర కట్టుకుని భారతీయ సంప్రదాయం ననుసరించి నిరుపేద ప్రజల మధ్య సేవ చేయుటకు నిశ్చయించుకున్నట్లు వ్రాసింది. ఆ పేపర్స్ చదివి ఫాదర్ వాన్ ఎగ్జిమ్‌గారు ఆమెకిచ్చిన సలహా ఏమంటే నీవు రోమ్‌లో వున్న పోప్‌గారికి నీ యొక్క విశ్వాసాన్ని కొనసాగించుకోడానికి, మరియు నీవు చేసిన వాగ్దానాల నుండి విడుదలను కలుగజేయుటకు అనుమతి కోరుకునే అర్జీ పెట్టుకోమన్నారు. అప్పుడు మదర్ తెరీసా ఇంకేమైన ఇతర మార్గాలున్నాయా అని అడిగింది. ఆర్చ్ బిషప్‌గారి సలహా తీసుకుని నీకు మార్గాన్ని చూపించమని అడగమన్నారు. ఫర్దీనంద్ పెరియర్, అర్చ్ బిషప్‌గారు లొరిటో సంస్థను దర్శించినపుడు మదర్ తెరీసా తన అభిమతాన్ని వినవలసిందిగా కోరుకుంది. ఆమె తనలో వున్న విషయాలన్నీ చెప్పుకుంది. ఆర్చ్ బిషప్‌గారు ఓపిగ్గా అన్నీ విన్నారు. ఇలాంటి అభ్యర్థన ఇంతకు మునుపు తన వద్దకు వచ్చినందు వలన ఆర్చ్ బిషప్‌గారు అంతగా చలించలేదు. ఆయన ముఖంలో ఏ విధమైన మార్పు లేదు. ఏమి ఆలోచన చేస్తున్నదీ కన్పించ లేదు. తనంతట తానుగా నిర్ణయము తీసుకోలేనని, రోమ్ నుండి అనుమతి లభించవలసి వుందని మాత్రము చెప్పారు. దేవునికి ఏదైనా సాధ్యమేనని మాత్రము చెప్పారు.

అదే సమయంలో మదర్ తెరీసాను అసన్‌సోల్ పట్టణా నికి మెడికల్ చెకప్ కొరకు పంపారు. ఆమెకు ఊపిరితిత్తుల వ్యాధి వుందేమోననే అనుమానంతో ట్యుబర్క్యులోసిస్ టెస్ట్

కొరకు పంపారు. కాని లేదని తేలింది. అచ్చట నుండి తిరిగి వచ్చినప్పుడు హిందూ, ముస్లీంల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మదర్ తెరీసా ఆ ఇద్దరు మతాల నాయకుల్ని పిలిచి సఖ్యత చేసి పంపారు. అందరు ఎంతో సంతోషించారు. ఆర్చ్ బిషప్‌గారు తన మనవిని పట్టించుకోలేదని మదర్ భావించారు. 40 సంవత్సరాలు సేవ చేసి కూడా ఆర్చ్ బిషప్‌గారికి నిరుపేదల పట్ల అవగాహనలేదని అనుకున్నది. అలాగని ఆయన్ని తీర్పు తీర్చలేదు. మదర్ తెరీసా అభ్యర్థనకు ముందు వేరొకరు అదే అభ్యర్థన చేసి ఒక సంవత్సర గడువులో తన నిర్ణయాన్ని కొనసాగించి స్థిరపడతారో లేదో అని చూచినపుడు ఆమె తన మనసు మార్చుకొనుట జరిగినది. అదే విధంగా మదర్ తెరీసా కూడా చేస్తుందా అని ఆర్చ్ బిషప్‌గారు ఆలోచించారు. ఆర్చ్ బిషప్‌గారు మదర్ తెరీసాను పిలిచి నీవు అనుకున్న నిరుపేద సేవను డాటర్ ఆఫ్ ఆన్నె సంస్థతో కొనసాగించవచ్చుగదా అని సలహా ఇచ్చారు. ఆ సలహా మేరకు వారితో తను కోరిన సేవా కార్యక్రమాల్ని చేయాలని ప్రయత్నించినపుడు తాను కోరిన విధంగా జరుగక పోవడము చూసి, ఆర్చ్ బిషప్‌గారితో సిస్టర్స్ ఆఫ్ ఆన్నే వారు తమ పద్ధతితో సేవ చేస్తున్నారుగాని, తాను అనుకున్న సేవ వారితో సఫలమవుట కష్టమని చెప్పింది. ఆర్చ్ బిషప్‌గారు నీవు అనుకున్నవన్ని ఒక్కరోజులో జరుగవు. నీవు కొత్త మిషనరీ మొదలు పెట్టాలంటే రోమ్ నుండి పర్మిషన్ అవసరము. మరియు మదర్ జనరల్ నుండి నీవు కాన్వెంట్ నుండి బయటకు వెళ్ళుటకు పర్మిషన్ ఇవ్వాలి అని చెప్పారు. ఆ విధంగా ఆర్చ్ బిషప్‌గారు మదర్ తెరీసాకు తన నిస్సహాయ తను తెలియజేశారు. అప్పుడు మదర్ తెరీసా తన రెండవ పిలుపును దేవుని చేతుల్లో వుంచి ముందుకు సాగింది. ప్రభువు ప్రణాళికలో వుంటే ఎలాగైనా జరుగుతుంది. కనుక తను మొదలు పెట్టే మిషనరీ యొక్క కాన్‌స్టిట్యూషన్ వ్రాయుట మొదలుపెట్టింది. మదర్ తెరీసా బయటకు వెళితే తనతో పదిమంది సిస్టర్స్ తనతో పని చేస్తామని స్వతహాగా ఒప్పుకుని మనస్ఫూర్తిగా రావాలి. అది ఒక సంవత్సర వ్యవధిలోనే జరగాలి. 1947 సంవత్సరమంతా ఎదురు చూసింది. ఆ సంవత్సరములోనే ఆగష్టులో ఇండియా రెండు ముక్కలై పాకిస్తాన్, భారతదేశాలుగా స్వాతంత్ర్యం పొందాయి. పాకిస్తాన్‌లోని హిందువులను ముస్లీం మతంలోకి మారాలని, భారత్‌లోని ముస్లీంలను హిందూమతంలోకి రావాలని గొడవలు జరుగుతున్నాయి. ఒరికనొకరు చంపుకుంటున్నారు. ఎక్కడ చూసినా ప్రజలు సురక్షితమైన ప్రదేశాలకు పరుగెడుతున్నారు. అప్పటి పరిస్థితి పిచ్చెక్కిన వారి ప్రవర్తనలా అనిపించింది. 1947 సెప్టెంబరు ఒకటిన గాంధీగారు కలకత్తాలో ఆమరణ నిరాహార దీక్ష పుచ్చుకున్నారు. 78 సంవత్సరాల వయసులో ఆయన తీసుకున్న నిర్ణయానికి బాధపడిన ఎందరో కరుడుగట్టిన నాయకులు ఆయన చెంత జేరి శాంతిని నెలకొల్పుతామని వాగ్దానము చేశారు. ఆ విధంగా కలకత్తాలో అల్లరి తగ్గిందిగాని అనేక ప్రదేశాల్లో అదే పరిస్థితి నెలకొంది. జనవరి 30, 1948న గాంధీగారి హత్య జరిగింది. అదే సంవత్సరము ఆగష్టులో దేవుని కృప మదర్ తెరీసాపై ప్రసరించింది. దేవునికి వందనములు చెల్లించింది. చిట్టచివరకు మదర్ తెరీసాకు తన సొంత మిషనరీస్ ఆఫ్ ఛారిటీని మొదలుపెట్టుకొనవచ్చు అనే పర్మిషన్ రోమ్ నుండి వచ్చింది. దేవునికి వందనములు చెల్లించింది. మొదటగా తాను రోగులకు చికిత్స చేయు విధానాన్ని నేర్చు కొనుటకు పాట్నాలో వున్న సిస్టర్స్‌కు ఉత్తరం వ్రాసింది. వెంటనే వారి దగ్గర నుండి జవాబు వచ్చింది. రోగులను శుభ్రపరచుట, వారి గాయాల్ని కడిగి కట్లు కట్టుట, వారికి ఇంజక్షన్లు ఇచ్చుట మొదలగు అనేక విషయాలు నేర్చుకుంది. తాను స్థాపించే సంస్థలో సిస్టర్స్ ఉప్పు, అన్నముతోనే సరిపుచ్చుకొని అతి సాధారణ జీవితము గడుపుతారని అచ్చటి డాక్టర్‌తో అన్నప్పుడు, మదర్ తెరీసాకు మంచి సలహా ఇవ్వబడింది. ఉప్పు అన్నంతో వారి శరీరము కూడా రోగగ్రస్తమై రోగులకు సేవ చేయుట కాకుండా వారు కూడా భారమయ్యే పరిస్థితి వస్తుందని చెప్పారు. అప్పుడు మదర్ తెరీసా తన అభిప్రాయాన్ని మార్చుకుని మన శరీరము దేవునికి ఆలయమై వున్నదని గ్రహించారు. మనము ఆరోగ్యంగా వుండి చుట్టూ వున్న వారికి ఆరోగ్యం ప్రసాదించి సేవచేయవలెనని నిశ్చయించు కున్నది. తనతో వుండబోయే సిస్టర్స్‌కి మంచి క్రమశిక్షణ, బేలేన్స్‌డ్ డైట్, అచంచలమైన సేవా దృక్పథం నేర్పించి ఆ సేవ ద్వారా యేసుప్రభువు ప్రేమ ప్రపంచ నలుదిక్కుల వ్యాపించాలని కోరుకుంది. తన కోరికలో స్వార్థం లేదు. ఎల్లప్పుడూ యేసుప్రభువే ఆమె హృదయంలో వుండి ఎలాంటి పరిస్థితినైనా చక్కబెట్టి ముందుకు తీసుకెళతారనే నిర్భయము. ప్రతిరోజు ఆమె ప్రార్థనలు దేవునికి చేరి తను చేయవలసిన పనులకు జవాబు లభించింది.

# విశ్వాసంలో ఓ మెట్టు



కనుక ఈ జీవితములో ఇప్పుడు వచ్చే జీతంతో వడ్డీలు మాత్రమే కట్టగలడు కాని అసలు ఎప్పుడూ తీర్చలేడని నిర్ధారణకు వచ్చాడు. ప్రెస్‌లో వచ్చే ఆదాయం అంతా ఏరోజు కారోజు ఖర్చు అయిపోతుంది. ఏదైనా అత్యవసర సమయాలలో ఎక్కువ డబ్బు అవసరమైతే రెడ్డిగారిని అడిగితే ఇచ్చేవాడు.

తెల్లవారిన తర్వాత ఒంగోలు నుండి ఉత్తరం వచ్చింది. తండ్రికి అనారోగ్యము వలన రాంబాబు హాస్పిటల్లో చేర్చారని తెలిసి వెంటనే ఒంగోలు వచ్చాడు సామ్యేలు. హాస్పిటల్‌కి వెళ్లి తండ్రిని పరామర్శించి పెద్ద తమ్ముని వద్దకు వెళ్ళాడు. తండ్రికి హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ అని, రెండు నెలల కంటే ఎక్కువ బ్రతకడని చెప్పారు అన్నాడు. బల్లమీద కొన్ని ఇంగ్లీషు నవలలు వున్నాయి. వాటిలో ఒకదాని మీద 'హై ఫైనాన్స్' అనే పేరుతో ఒక క్రొత్త పుస్తకం కనిపించింది. దానిని తీసికొని బస్‌లో చదువుతూ కనిగిరి చేరాడు. మరునాటికి ఆ పుస్తకం పూర్తి చేశాడు.

నేటి సామాజిక జీవితంలో అప్పులు ఎందుకు తీరటం లేదు, దశమభాగం ఎలా ఇవ్వగలము అనే అంశాలపై సమగ్రంగా చర్చించాడు రచయిత. సామ్యేలుకు ఆ పుస్తకం బాగా నచ్చింది. నువ్వు నీతిమంతుడివా? కాదా? విశ్వాసివా? కాదా? యేసును నమ్మావా? లేదా? అనే విషయమును ప్రక్కనపెట్టి 'దశమ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసికొని రండి. దీని చేసి మీరు నన్ను శోధించిన యెడల...' అని బైబిల్లో వ్రాయబడి వుంది. అప్పట్నుండి ఒక్క రూపాయిలో అయినా సరే పదవ వంతు తీసి దేవుని మందిరములో ఇచ్చేవాడు సామ్యేలు.

ఆరు నెలలు గడచిపోయాయి. ఒంగోలులో చదువుతున్న మూడవ కుమారుడు చక్రవర్తికి పెన్షన్ పుస్తకము ఇచ్చి ప్రతినెలా వచ్చే 415 రూపాయల పెన్షన్‌లో 300 రూపాయలు మద్రాసు బైబిల్ కాలేజీలో చదువుతున్న రెండవ కుమారుడు ఇమ్మానియేల్ రాజేంద్రకు పంపి వంద రూపాయలు అతన్ని తీసుకొమ్మని చెప్పాడు. ఒకసారి ఒంగోలు వచ్చి పెన్షన్‌ఖాతాలో ఏమైన డబ్బులు మిగిలి వున్నాయేమో తీసుకుందామని చూస్తే ఆ ఖాతాలో 2,762 రూపాయలు వున్నాయి. సామ్యేలు నమ్మలేకపోయాడు. వెంటనే బ్యాంకు వారిని అడిగాడు ఖాతాలో ఎంత డబ్బు వుందని. వారు ఖాతా పరీక్షించి 2,762 ఉన్నాయి అని చెప్పారు. తర్వాత ఆరునెలల్లో సామ్యేలుకు ఒక్క రూపాయి కూడా అప్పు మిగలలేదు.

వెంటనే 'హై ఫైనాన్' పుస్తకం వ్రాసిన రచయితకి అమెరికాలో వున్న నల్లజాతి పాస్టరు ప్రిన్సుకి ఉత్తరం వ్రాశాడు. మీ పుస్తకం చదివాను ఈ పుస్తకం తెలుగులోకి అనువదించి ముద్రించుటకు అవకాశం కల్పించమని. కాని ఆ రచయిత ఏవేవో పనికిమాలిన ప్రశ్నలు వేస్తూ జవాబు వ్రాశాడు. అప్పుడు అతని ప్రశ్నలకు వినయముగా జవాబు వ్రాశాడు సామ్యేలు. ఈసారి ఆ నల్లజాతి రచయిత చాల ఎచ్చులు పడుతూ ఉత్తరం వ్రాశాడు పుస్తకమైతే వ్రాశాడు కాని అతనిలో దైవలక్షణాలు ఏమి లేవు. ఆనాడు సామ్యేలు రచయిత కాదు. లేకుంటే ఆ పుస్తకాన్ని నేటి సామ్యేలు వ్రాసే ధోరణిలో తెలుగులో వ్రాసి వుండేవాడు. ఏదిఏమైనా దశమ భాగములోని మహత్తు సామ్యేలు అనుభవములోనికి దేవుడు తెప్పించాడు.

1987 మే 2వ తేదీన తన తండ్రి పుట్టిన రోజు. కుటుంబముతో ఒంగోలు వచ్చాడు సామ్యేలు. ఉదయం 6 గంటలకు తండ్రిని చూడటానికి వెళ్ళాడు. తన తండ్రి పుట్టిన రోజును జరుపుకోవాటానికి ఒంగోలు ప్రక్కన ఒక ఊరు వెళ్ళాడని తెలుసుకున్నాడు. మరలా వచ్చేనెలలో వచ్చినప్పుడు తండ్రిని చూడవచ్చు అనుకుని కనిగిరి వెళ్ళిపోయాడు.

14 రోజుల తర్వాత మే 16 సాయంకాలం నాలుగు గంటలకు ఫాదర్ ఎక్స్‌పైర్డ్ అని టెలిగ్రాం వచ్చింది. అప్పుడు హాస్పిటల్లో ఓ.పి. చీట్లు వ్రాస్తున్నాడు. ఆ టెలిగ్రాం తీసుకొని లాబ్‌టెక్నిషియన్ వీరభద్రయ్యగారి దగ్గరకు వెళ్తుంటే దూరాన్నించి సామ్యేలును చూస్తున్న భద్రయ్య 'ఏమిటండి గంటక్రితం బాగున్నారు. ఇంతలోనే ముసలాడిలా అయ్యావు' అన్నాడు. మా 'నాయన చనిపోయాడు' ఇప్పటిదాకా ఒకాయనకి పెద్ద కుమారుడిని, ఇప్పుడు ఆయన చనిపోయాడు కాబట్టి ఇక నేను కుమారత్వంలో నుండి పిల్లలకి తండ్రిగా అయ్యాను. ఇక ఎన్నడూ ఎవరి కుమారుడిని కాను అన్నాడు

సామ్యేలు. నీరసం వచ్చింది. అంతా శూన్యంగా కనిపించింది. ఆయన మంచోడో చెడ్డడో, తనకి పెట్టాడో పెట్టలేదో, ఎదైనా మిగిల్చాడా లేదా? అనే విషయం కాదుగాని ఎందరున్నా తండ్రి ఒక్కడే. ఆయన ద్వారా వచ్చిన ఈ జీవితం. ఆయన బ్రతికి వున్నా చనిపోయినా తను చనిపోయే వరకు తన పేరు ప్రక్కన కాని, పేరు తర్వాత కాని సన్ ఆఫ్ అని పెట్ట వలసిన వ్యక్తి ఇక లేదు.

పెద్ద డాక్టరుగారి దగ్గరకు వెళ్ళి సెలవు తీసికొని, రెడ్డిగారి దగ్గరకు వెళ్ళాడు. సామ్యేలు ముఖం చూసి రెడ్డిగారు ఖిన్నుడయ్యాడు. సంగతి తెలిసి విచారించాడు. తన జేబులో ఎంత డబ్బు ఉందో లెక్క పెట్టకుండా సామ్యేలు చేతికిచ్చాడు.

ఫుల్‌సూట్‌లో పెద్ద ఐస్ గడ్డమీద నిశ్చలంగా పండుకొని వున్న తండ్రి శరీరం. కోపం, ప్రేమ, విశ్వాసం, అవిశ్వాసం లేని శరీరం. భారీ దేహము. ముప్పై సంవత్సరాలకు పూర్వం యేసు కొరకు ఆయన సేవ చెయ్యాలనే తపనతే తనతో పాటు తన భార్యా పిల్లలను మూడు సంవత్సరాలు అన్నాహారాలు లేకుండా జీవింపజేసిన ఈ శరీరం విశ్రాంతిగా తన ఎదురుగా వుంది.

యేసు కొరకు అవమానాలు, భయంకరమైన నిందలు, ఆవేదనలు భరించిన శరీరం ఐస్ మీద వుంది. 12 మంది బిడ్డలకు తండ్రి. ఒక్కొక్క బిడ్డ కొరకు ఒక్కొక్క రకమైన వేదన పొందిన శరీరం. ప్రభువు కృప వలన వేలకు వేలమంది అనాధలకు స్వంత తండ్రి కన్నా ఎక్కువ ప్రేమను పంచి యిచ్చిన శరీరం ఐస్ మీద వుంది. ఈ లోకంలో ఈ శరీరాన్ని విడవాలంటే ఎన్నో విధానాలు. రోగం, ప్రమాదం, ఆత్మహత్య, హత్య. ఎక్కువ భాగం రోగం, మంచంలో వుండి, మనుష్యులను వేధించి, తను వేదన పడి శరీరాన్ని విడవాలి.

చాలమంది వయస్సు ముదిరిన తర్వాత శరీరాన్ని వదిలించుకోవాలని చూసినా అది వారి వల్ల కాదు. మరణం వారిని చూసి పారిపోతుంది. అటువంటి వారి అనుభవాలెన్నో చూశాడు సామ్యేలు. బైబిలు గ్రంథంలోని పితరుల మరణాలన్నీ వారి ఆత్మీయ జీవితాన్ని సూచిస్తాయి.

యాకోబు తన కుమారుల కాజ్ఞాపించుట చాలించి మంచము మీద తన కాళ్ళు ముడుచుకొని ప్రాణము విడిచి తన స్వజనుల యొద్దకు చేర్చబడెను అన్న వాక్యము జ్ఞాపకమునకు వచ్చింది. తన తండ్రి ఆత్మీయస్థితి ఆయన మరణములో బయలుపరచబడినదని సంతోషించాడు సామ్యేలు.

తన తండ్రి వంశములో పురుషులందరూ 75 సంవత్సరాలకు, స్త్రీలు 85 సంవత్సరాలకు తనువు చాలించారు. తనకు ఇప్పుడు 47. అంతా సక్రమంగా జరిగితే ఇంకా 23 సంవత్సరాల ఆయుష్షు వుంది. గడిచిన 47 సంవత్సరాలలో ఏమి సాధించాడు. ఉన్నవన్నీ పోగొట్టు కున్నాడు. తన వయస్సులో తన తండ్రి దేవుని యందలి అచంచల విశ్వాసంతో ఒక సంస్థనే స్థాపించాడు. తనైతే ఈ లోకముతో స్నేహంచేసి సంస్థలలోను, మనుష్యుల దగ్గర పని చేస్తున్నాడు. ఆలోచిస్తూ తండ్రి వైపు ఎంతసేపటి నుండి నిలబడి అలా చూస్తూ నిలబడ్డాడో తెలియదు సామ్యేలుకి. తనను వదలి వెళ్ళిపోయిన తన సాటిలేని సహాయిని స్వరము ప్రక్కగదిలో వినబడినప్పుడు తనలో చలనం వచ్చి అందరిని వదలి బయట చర్చిలో ప్రవేశించి ఒంటరిగా కూర్చున్నాడు.

మరునాటి ఉదయానికి బంధువులు వచ్చారు. సాయంత్రం నాలుగు గంటలకు బాప్టిస్టు సమాధుల స్థలమునకు వచ్చినప్పుడు తన తండ్రి కొరకు ఏర్పాటు చేయబడిన స్థలమును చూసి ఆశ్చర్యపోయాడు. అప్పటికి అయిదు సంవత్సరాలకు ముందు తన తల్లిని వుంచిన చోటు ప్రక్కనే తన తండ్రికి స్థలము వుంది. మామూలుగా అయితే ఎవరైనా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తేనే కాని భార్యాభర్తలకు ఒకేచోట స్థలము దొరకదు. ఇది దేవుని కృప. సామ్యేలు హృదయంలో దేవుని యెడల ఎనలేని కృతజ్ఞతా భావం ఏర్పడినది. మనుష్యులు పట్టించుకోని అనేక విషయాలు దేవుని సంకల్పము వలననే నెరవేరుతాయి. అన్నింటికంటే ఆశ్చర్యకరమైన సంగతి ఏమిటంటే సమాధి కార్యక్రమం పూర్తయ్యేటప్పుడే కొందరు వెళ్ళిపోయారు. పూర్తిగా మట్టి కప్పబడిన మరుక్షణంలో పారతో మట్టి కప్పుతున్న వ్యక్తి తప్పితే మరెవరూ అక్కడ లేరు. చీకటి పడలేదు. అయినా అందరూ వెళ్ళిపోయారు. రాత్రి ఆయన దేహము దగ్గర కూర్చున్న వారు కాని, ఆయనను అమితంగా ప్రేమిస్తున్నామని చెప్పుకున్న వారు కాని ఎవరూ లేరు. ఇదీ జీవితం. మనిషిని పూడ్చిపెట్టిన క్షణంలోనే మనిషి మరువబడతాడా? ఔను ఒక మనిషితో, అతను ఎవరైనా అతనితో అవసరం వుంటేనే అతను మన హృదయంలో వుంటాడు.

(ఇంకావుంది)

బాలల శీర్షిక

# యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట....

**యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట దీర్ఘాయువునకు కారణము** (సామెతలు 10:27). యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట వలన మనము ఎక్కువ కాలము బ్రదుకునట్లు యెహోవా మనకు దీర్ఘాయువును ప్రసాదిస్తాడు. అలాగే పది ఆజ్ఞలలో ఐదవ ఆజ్ఞ వలన కూడా మనం దీర్ఘాయువును పొందగలము. అనగా యెహోవా యందు భయభక్తులు కలిగిన ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను సన్మానిస్తారు. తల్లిదండ్రులకు లోబడి వారి ఇష్టప్రకారం జీవిస్తారు. అలాంటి వారికి దేవుడు దీర్ఘాయువును దయచేస్తాడు. బైబిల్లో అనేకమంది జీవితాలను మనం గమనిస్తే యెహోవా యందలి భయభక్తులు గలవారు దీర్ఘకాలం జీవించినట్లు చూడగలం. నేటి సమాజంలో ఆరోగ్య విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ అనేకమైన మందులు వాడుతూ ఎక్కువకాలం జీవించాలి అనుకుంటూ వుంటారు. కాని యెహోవాయందలి భయభక్తులు లేనివారి యొక్క ఆయుష్షు మధ్యలోనే ఆగి పోతుంది.

యెహోవా యందలి భయభక్తులు కలిగియుండుట వలన దీర్ఘాయుష్షు కలుగుటయేకాక ఉన్నత స్థితిలో కూడా దేవుడు వుంచుతాడు అన్నదానికి నిదర్శనం మనకు బైబిల్లో కనబడు తుంది. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, యోసేపు, మోషే, యెహోషువ, దావీదువంటి వారు యెహోవాయందలి భయ భక్తులు కలిగి జీవించినట్లు మనం గమనించగలం. అయిన ప్పటికీ వారు తప్పులు చేసినప్పుడు దేవుడు వారిని శిక్షించి క్షమించాడు.

ఇస్సాకును బలిగా కోరినప్పుడు అబ్రాహాము విష యంలో దేవుడు **'నీవు దేవునికి భయపడువాడవు'** (ఆది. 22:12) అని స్వయంగా సాక్ష్యమిచ్చాడు. బైబిల్లోని విశ్వాస వీరులందరికీ తెలుసు యెహోవాకు అసాధ్యమైనది ఏదీ లేదని. అందుకే వారు దేవునియందు భయభక్తులు కలిగి జీవించారు. యెహోవా యందలి భయభక్తులు లేక జీవించటం వలన ఏలీ కుమారులైన హొఫ్ని, ఫీనెహాసులు అర్థాంతరంగా మరణించాల్సి వచ్చింది. వీరు మరణించడానికి దేవుని యందలి భయభక్తులు లేకపోవడమే కాక వారి తల్లిదండ్రులు కూడా కారణం. తండ్రి ఏలీ బాధ్యతాయుతమైన యాజకుడై యుండి బిడ్డలను దేవుని భయంలో పెంచకపోవడం వలన బిడ్డల మరణానికి కారణమయ్యాడు. తల్లిదండ్రులు బిడ్డలను గారాభంగా పెంచుతూ వారు చేసే కొన్ని తప్పులను పట్టించు కోకపోవడం వలన అవే తమ బిడ్డల యొక్క భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. నేడు అనేకమంది యౌవనస్తులు అనేకమైన దుర్వ్యసనాలకు బానిసలయ్యి, అనేక సంఘవ్యతిరేక కార్యాలను చేస్తూ అనేక రకాల ప్రమాదాలకు, హత్యలకు గురవుతూ అర్థాంతరంగా తనువు చాలించడానికి కారణం వారి తల్లిదండ్రులే.

కొంతమంది తల్లిదండ్రులు వారి బిడ్డలను బొత్తిగా దండించరు. అలా దండించక పోవడం వారిని ఎక్కువగా ప్రేమిస్తున్నాము అనుకుంటుంటారు. ఈ సందర్భంలో సామెతలు గ్రంథములో వ్రాయబడిన కొన్ని వాక్యములను పరిశీలిద్దాం. **'బెత్తము వాడనివాడు తన కుమారునికి విరోధి కుమారుని ప్రేమించువాడు వానిని శిక్షించును'** (సామెతలు 13:24); **'బాలుని హృదయములో మూఢత్వము స్వాభావి కముగా పుట్టును శిక్షాదండము దానిని దానిలో నుండి తోలి వేయును'** (సామెతలు 22:15); **'నీ బాలురను శిక్షించుట మాను కొనకుము, బెత్తముతో వాని కొట్టిన యెడల వాడు చావకుండును; బెత్తముతో వాని కొట్టిన యెడల పాతాళ మునకు పోకుండ వాని ఆత్మను నీవు తప్పించెదవు'** (సామెతలు 23:13,14); **'బెత్తమును గద్దింపును జ్ఞానము కలుగజేయును, అదుపులేని బాలుడు తన తల్లికి అవమానము తెచ్చును'** (సామెతలు 29:15). పై వాక్యములను పరిశీలించినచో బిడ్డలను తగిన విధంగా క్రమశిక్షణలో పెంచటమన్నది వారి జీవితాల పట్ల ఎంత ప్రాముఖ్యమైనదో గమనించగలం. దేవుని యందలి భయభక్తులతో పెంచినచో బాలుడు జ్ఞానమును, తెలివిని సంపాదించుకొనుటయే కాక దీర్ఘాయువును కూడా పొంద గలుగుటకు తల్లిదండ్రులే కారకులవుతారు.

బిడ్డలను సరైన క్రమశిక్షణలో పెంచుటకు సండేస్కూలు ఎంతో దోహదపడుతుంది గనుక బిడ్డలను సండేస్కూలుకు పంపించడం ఎంతో ఉత్తమము.

మార్గదర్శి

# బ్రదర్ భక్తసింగ్

బ్రదర్ భక్తసింగ్ వ్యక్తిగతంగా ఎవర్నీ నిందింపడు, దూషింపడు. ఇతరుల ఆత్మక్షేమం కోసం ఎలా ప్రార్థించాలో ఆయనకు తెలుసు. ఒకసారి సహోదరుడు ఒక వివాహాన్ని చేయాల్సివచ్చింది. సహోదరి అన్యుల్లాగా ఒంటినిండా బంగారం బాగా వేసికొంది. బాగా ముస్తాబైంది. వివాహానికి వచ్చిన అనేక మంది విశ్వాసులు ఈ విషయాన్ని గురించి మల్లగుల్లాలు పడుతున్నారు. అయితే సహోదరుణ్ణి అడిగే ధైర్యం ఎవరికీ లేదు. బ్రదర్ భక్తసింగ్ యథాప్రకారం వివాహం చేసి పంపాడు. కొంతకాలమైన తర్వాత ఆ సహోదరి వంటి మీద ఒక్క బంగారు వస్తువు కూడా లేదు. అంతేకాదు. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చింది. ఇది ప్రభువు కార్యం. తరువాత ఆమె దేవుని పట్ల ఎంతో నమ్మకంగా వుంది. సహోదరుడు భక్తసింగ్ ముఖాముఖిగా ఆ దినం ఆమెను ఖండిపకపోయినా ఆమె కోసం ప్రార్థించాడు. ప్రభువు జవాబిచ్చాడు. సహోదరుడు ఒక దైవజనుడని ప్రభువు తగిన సమయంలో ఋజువు పరుస్తుంటాడు. తగ్గింపు జీవితం ఆయన నేర్చుకున్న ఇంకొకపాఠం. ఎవరినీ నిందించడు. నిందల్ని స్వీకరిస్తాడు. ఎవరినీ అవమానపరచడు. అవమానాల్ని సహిస్తాడు. చాలా సంవత్సరాల క్రితం కరాచిలో ఒక పాస్టరు సహోదరుడిపై నిందలు మోపి ఒక కరపత్రాన్ని ముద్రించి దేశవిదేశాల్లో పంచాడు. తరువాత కొద్ది కాలానికి బ్రదర్‌కు విషయం తెలిసింది. అయినా ఆ విషయాన్ని పట్టించుకోలేదు. అయితే వాళ్ళిద్దరూ పరస్పరం కలుసుకున్నప్పుడల్లా చేయి చేయి కలుపుకొనేవాళ్ళు. ఆ విషయం బ్రదర్ భక్తసింగ్‌కు తెలియదని ఆ పాస్టరు అనుకొనేవాడు. సహోదరుడి స్నేహితుడు ఆ పాస్టరుపై కోర్టులో కేసు వేయమని సలహా ఇచ్చాడు. కాని బ్రదర్ లేఖనాల ప్రకారం కోర్టుకి వెళ్ళడానికి మనకు ఎటువంటి అధికారం లేదని తెలిపాడు. అంతేకాదు అతని కోసం ప్రార్థించాలని దేవుడే తీర్పు తీరుస్తాడని సహోదరుడు దైవక్రమాన్ని పాటించి అన్నాడు. కొంతకాలమైన తరువాత ఆ పాస్టరుకు జబ్బు వచ్చింది. అతని శరీరం మీద పెదవుల మీద బొబ్బలు పుట్టాయి. బ్రదర్ మనసులో కల్మషంలేని వాడు కాబట్టి అతన్ని చూడటానికి వెళ్ళి ప్రార్థించాడు. అప్పుడు ఆ పాస్టరు సహోదరుడి చెయ్యి పట్టుకొని క్షమాపణ కోరాడు. సహోదరుడు దేవునిపై ఆధారపడి శత్రువు తీసికొనివచ్చే ప్రతి ఆటంకాన్ని లయపరచాడు. తన ఓర్పు దీర్ఘశాంతం, సహన బుద్ధులతో ప్రభువుకి మహిమ తెచ్చాడు.

అనేక మందిని ప్రభువులోకి నడిపించిన గొప్ప ఉపదేశకుడు బ్రదర్ భక్తసింగ్. తన జీవితాంతం ప్రభువుని తప్ప మరి దేన్నీ కలిగి ఉండలేదు. విశ్వాసంతో ప్రార్థించడం, దేవుని చిత్తాన్ని తెలుసుకోవడం, దేవుని చిత్తానుసారంగా నడవటం తన ధార్మిక దృష్టికి నిదర్శనం.

క్రైస్తవ జీవితంలో ప్రభువుని ఆరాధించటం ముఖ్యమని గ్రహించాడు. అందువల్లే వాక్యానుసారంగా ప్రభువుని ఆరాధించటం, ప్రభువు బల్లలో చేయివేయడం తన సంఘాల్లో అమలుపరచాడు. ప్రభువు మాత్రమే మహిమ పొందాలి కాని మానవుడు మహిమ పొందకూడదని సహోదరుడు అనేక సందర్భాల్లో తన వర్తమానాల్లో స్పష్ట పరచాడు. రక్షణను గురించి పదేపదే నొక్కి చెప్పేవాడు. సహోదరుడు భక్తసింగ్ ఉపదేశించేటప్పుడు ఎన్నో ఉపమానాలు, కథలు, తన అనుభవాలను గురించి చెప్పేవాడు. ప్రజల హృదయాల్లో దేవుని వాక్యం సూటిగా బలంగా నాటుకొని పనిచేయడానికి ఇవి ఎంతో ఉపయోగపడేవి. సహోదరుడు చెప్పిన ఆత్మీయ హెచ్చరికల్లో మనం ఎన్నో ఉపమానాల్ని ఇంతకుముందు చూశాము. సిలువశక్తిని గురించి సహోదరుడు ఒక చరిత్రను తన వర్తమానాల్లో మాటిమాటికి చెప్పేవాడు. ప్రభువు మహిమార్థమై అనేక మందికి రక్షణార్థమై ఆ చారిత్రక కథను మీ ముందు వుంచుతున్నాము.

ఒక చిత్రకారుడు యేసుప్రభువు సిలువపై వున్నట్లు చిత్రించాడు. ఆ చిత్రకారుడు ప్రభువుని విశ్వసింపని యూదుడు. ఒక యువతి చిత్రాన్ని అతడు వేస్తుండగా ఆ యువతి అతడు దగ్గరకు వచ్చినప్పుడల్లా ఆ సిలువపై వున్న క్రీస్తు చిత్రాన్ని చూసి 'ఆయన ఎవరు?' అని ప్రశ్నించేది. ఈ విధంగా వచ్చిన ప్రతిసారి అతన్ని అడుగుతుండేది.

సాక్ష్యము

# ఆనందం దేవకుమార్

లక్కినేని ప్రకాష్‌బాబుని అంతా ఆర్.పి. అంటారు. ఆర్.పి. అంటే ఏమిటి? అంటే బదులు చెప్పడు. నా ఎదురుగా కూర్చుని అయిదు నిమిషాల్లో పెన్సిల్‌తో చక్కని ఫోటో గీసి ఇచ్చాడు. తను ఏ వూరు వెళ్ళినా, ఎవరి గురించి అయినా సమాచారం అందించి 'సార్ మీరు వారిని కలిసి వాక్యం చెప్పాలి' అంటుంటాడు. అలా పరియచమైన వారిలో ఇనమ దుగు గోపిచెట్టిగారు ఒకరు. వారి సాక్ష్యం ప్రచురించాము.

జెమ్మి మల్లిఖార్జున్ అనే స్నేహితుని చూడటానికి సూళ్ళూరుపేట వెళ్లిన ఆర్.పి. నెల్లూరు అగ్రికల్చర్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంటు దేవకుమార్‌ని మీరు కలవాలి సార్ అని ఎన్నోసార్లు అడిగాడు. ఒకరోజు నెల్లూరులో కూరగాయల మార్కెట్ పైనున్న మిద్దెలో వున్న ఆఫీస్‌లోకి వెళ్ళి దేవకుమార్ గారిని కలిశాను. ఐదడుగుల నాలుగంగుళాల ఎత్తు, సన్నగా, ముప్ఫై సంవత్సరాల వయస్సున్నట్లు కనిపిస్తున్న దేవకుమార్ గారు నన్ను చూసి ఎంతో సంతోషించి నా నవలలన్నిటిని కొన్నారు. నెల్లూరు వస్తే ఖచ్చితంగా మా దగ్గరకు రండి అన్నాడు. తర్వాత కాలంలో రెండుసార్లు వారిని వారి ఆఫీసు లోనే కలిసి వాక్యమును పంచుకున్నాము తర్వాత ఆయన నివసించే నాయుడుపేటకు రమ్మని ఆహ్వానించారు.

నాయుడుపేటలో గవర్నమెంటు డిగ్రీ కాలేజి ఎదురుగా వున్న అతి బీదవారి కాలనీలో వారి ఇంటికి వెళ్ళాను. రేకుల ఇల్లు. చుట్టూ పూలతోట. ఆ రాత్రి ఆ చుట్టుప్రక్కల నివసించే వారిని పిలిచి ప్రార్థన కూటము నడిపించారు. ఇలా ఒక సంవత్సరము గడిచిపోయేటప్పటికి ఆయన ప్రభువులో చాలా ఎదిగాడు. 2007లో ఆయనకు ఆఫీసు సూపరింటెండెం టుగా ప్రమోషన్ వచ్చింది. 2008లో పదవీ విరమణ చేశాడు.

ఒంగోలులో హన్నాకృప ద్వారా జరుపబడిన ప్రతి ప్రోగ్రామ్‌కు కుటుంబముతో వస్తున్నట్లుగా తెలిపేవాడు. కాని ఒక్కసారి కూడ హాజరుకాలేదు. మార్చి నెలలో తను కుటుం బంతో ఒంగోలు వస్తున్నట్లుగా తెలియజేశాడు. మరునాడు ఏడు గంటలకు ఫోనుచేసి ట్రైన్ ఎక్కినట్లు చెప్పాడు. వారిని ఆహ్వానించటానికి రైల్వేస్టేషన్‌కి వెళ్తుంటే ఆయన ఒక్కడే ఎదురు వచ్చాడు. ఇంటికి వచ్చిన తర్వాత మంచిచెడ్డలు మాట్లాడు కున్నాము. హన్నాకృప ఆఫీసులో ఆయన ఒక గంటసేపు కూర్చున్నాడు.

మీకు పెన్షన్ మొదలైందా? అరియర్స్ వచ్చాయా? అని అడిగాను. ఏవీ రాలేదన్నారు. తర్వాత వారిని సాగనంపే ముందు ప్రార్ధన చేయటానికి నిలబడ్డాను. ఆయన తన బైబిలును నా చేతిలో పెట్టి ప్రార్ధన చెయ్యండి అన్నారు. నేను ప్రార్ధన చేసి వారి బైబిలును వారికిస్తుండగా బైబిల్లో వుంచిన డబ్బును తీసి నా చేతిలో వుంచాడు. చూస్తే పదివేలు వున్నాయి. నాకు అర్ధంకాలేదు. ఆయనకు రావలసిన డబ్బులు రాలేదు. మరి పదివేలు ఎక్కడివి? పదివేల రూపాయలతో ఆయనకు అత్యవసరమైన పనులెన్నో ఉన్నాయి. అంతకంటే ముఖ్యంగా ఆయన తల్లిని అనేక శ్రమలుకోర్చి వైద్యము చేయించే స్థితిలో పదివేలు దేవుని కొరకు సమర్పించుకోవటం చూస్తే 'ఈమె తన లేమిలో తనకు కలిగినదంతయు అనగా తన జీవన మంతయు వేసెను' అని కానుకల పెట్టెలో కానుక వేసిన బీద విధవరాలు గుర్తుకు వచ్చింది.

'మీకు గవర్నమెంటులో రావలసిన డబ్బు వచ్చిన తర్వాత ఇవ్వకపోయారా?' అన్నాను. 'నా భార్య విజయకుమారి వారం రోజుల నుండి నన్ను ఒంగోలు వెళ్ళి ఈ చందా డబ్బులు ఇచ్చి రమ్మని పోరు పెట్టిందండి' అన్నాడు.

సరే మీ సాక్ష్యము చెప్పండి అన్నాను.

మాది సూళ్ళూరుపేట, మన్నారుపోలూరు గ్రామం. మాతండ్రి జోసఫ్ సుందరరావు, తల్లి చంద్రలీలావతి. మా అన్న ప్రేమకుమార్, నేను దేవకుమార్. నాకు ఊహ తెలియక ముందే మా తండ్రి మమ్ములను వదలి వెళ్లిపోయి నందున ఆయన ఇంటిపేరును మేము స్వీకరించక మా నాయనమ్మపేరు ఆనందమ్మను మా ఇంటిపేరుగా 'ఆనందం'గా మార్చు కున్నాము.

మా ఊరిలో ఎలిమెంటరీ చదువు పూర్తి చేశాను మా మేనమామ డి.జె.కృపానందంగారి సహాయంతో నెల్లూరులో హాస్టల్లోచేరి హైస్కూలు విద్య కోల్సు అక్రిమెన్ మెమోరియల్ హైస్కూల్లో, పట్టాభిరామ్ హాస్టల్లో వుండి చదివి, వి.ఆర్. కాలేజీలో పి.యు.సి. చదివాను.

నా జీవితమంతా నడిపే నాథుడులేక తెగిన గాలిపటం లాగా స్నేహితుల వలన అనేక వక్రమార్గాల్లో నడిపించబడ్డాను. తర్వాత మా మేనమామ వద్దకు మద్రాసు చేరి ఏదో ఒక పని చేసుకుంటూ జీవించాను. 1982లో వివాహము జరిగింది. కాని ఆమె కొద్దికాలానికే చనిపోయింది. అటువంటి పరిస్థితుల మధ్య మత్తుపానీయాలకు అలవాటుపడ్డాను. తరువాత నా మరదలు విజయకుమారి నన్ను వివాహము చేసుకుంది. ఆమె చిన్ననాటి నుండి దేవుని భయములో పెరిగినది. నా కొరకు నిత్యము ప్రార్థించేది.

వ్యవసాయశాఖలో నాకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగము వచ్చింది. 1983 డిసెంబర్ 14న నా కుమార్తె పుష్పలత జన్మించింది. 1993 జనవరి 22న కుమారుడు వినీత్‌కుమార్ జన్మించాడు. అయినా నా జీవితంలో మార్పు రాలేదు. నా కొరకు నా భార్య విజయకుమారి ప్రార్థించుట మానలేదు.

కాళహస్తి నుండి తబిత అనే సహోదరి మమ్మును వెదుక్కుంటూ వచ్చి దేవుని వాక్యము చెప్పేది. ఆమె అవివాహితయై దేవుని సేవ చేస్తున్నది. సూళ్ళూరుపేట నుండి మనోహర్ పాస్టరుగారు డి.ఓ.యస్. కాలనీలో బెరాకా చర్చి నుండి వచ్చి వాక్యము చెప్పేవారు.

నాకు సీనియర్ అసిస్టెంటుగా ప్రమోషన్ వచ్చి నెల్లూరు మార్చారు. 2005లో అన్ని విషయాలలో పతనమైన పరిస్థితుల్లో వాక్యపఠనములో ఆసక్తి కలిగినది. 2004లో నేను నా భార్య బాప్తిస్మం తీసుకున్నాము. అదే సమయంలో హన్నాకృప పత్రిక పరిచయమైనది. కొడవటికంటిగారి రచనలన్నీ చదివి దేవునిలో ఎదిగాను. ప్రార్థన అలవాటయ్యింది. రిటైరైన తర్వాత ప్రార్థనలకు వెళ్ళటానికి దేవుడు నాకు మంచి గాత్రం ఇచ్చాడు. నా పిల్లలిద్దరూ మంచిగా మసలుకుంటారు. కుమార్తె పుష్పలత ఎం.సి.ఏ. చేస్తుంది. కుమారుడు 10వ తరగతి చదువుతున్నాడు. దేవుడు ఆరోగ్యం ఇచ్చాడు. మనసు నెమ్మది ఇచ్చాడు. దుర్వ్యసనాలు పోయినందున డబ్బులు ఖర్చు తగ్గి మిగిలినవి.

నా భార్య విజయమ్మ మా దగ్గర వున్న డబ్బును దేవుని సేవకు సమర్పించమని చెప్పింది. ప్రార్థించి హన్నాకృపకు ఇవ్వాలనుకున్నాము. ఇందులో నా భార్య ప్రోత్సాహమే ఎక్కువ.

నా సాక్ష్యము పదిమందికి తెలియాలి. నా జీవితములో యౌవనకాలము మొదలుకొని ఇంతవరకు జీవితమంతా యేసును ఎరుగక గడిచిపోయింది అనే దిగులు. ఇకమీదట ప్రతిరోజూ ప్రతి గంట యేసుప్రభువుకు సాక్షిగా జీవించాలని ఆశ అని ముగించాడు.

యేసుప్రభువు కొరకు ఇంకా ఏమైనా చెయ్యాలని నా ఆశ ఫాదర్ అన్నది ఆనందం దేవకుమారు భార్య విజయకుమారి.






క్విజ్ **జూన్ నెల ప్రశ్న ? 43**

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

1. పొంగని ఆహారము ఏమి చేయును?

2. **ఆదికాండము 9:2లో మనుష్యుల యెడల జంతువులకు కలుగు భావము తెలుపబడినది. అది తోటి మానవులకు కలుగుటకు కారణము?**

3. **నీతిమంతుని మాటలకు అపార్థము పుట్టించునది** ఏమి?

4. మోషే వ్రాసిన **ధర్మశాస్త్రమందలి ధర్మము ఎక్కడ** వున్నది?

**మే నెల ప్రశ్నకు జవాబులు :**

1. ఈ కట్టడలన్నింటిని మీరు గైకొని ఆచరింపవలెను. వాటిని గూర్చి విను జనముల దృష్టికి అదే మీకు జ్ఞానము. అదే మీకు వివేకము. ద్వితీ. 4:6.

2. మన దేవుడైన యెహోవా మనకాజ్ఞాపించినట్లు ఆయన సన్నిధిని ఈ సమస్త ఆజ్ఞలను మనము అనుసరించి నడచుకొనినప్పుడు మనకు నీతి కలుగును. ద్వితీ. 6:25.

3. తుదకు నీకు మేలు కలుగవలెనని నిన్ను అణచుటకును, శోధించుటకును నీ పితరులు ఎరుగని మన్నాతో అరణ్యమున నిన్ను పోషించెను. ద్వితీ. 8:16.

**సరియైన జవాబు వ్రాసిన వారు :**
**శ్రీమతి బత్తుల ఆనీమేరి, హైదరాబాదు**
**శ్రీమతి బి.ఎ. లాజరస్, నిడదవోలు**
**ప్రయత్నించినవారు :**
**శ్రీమతి పి.జె. సత్యవాణి, తెనాలి**

**ఈ నెల పోషకులు :**

| | | |
|---|---|---|
| రెవ.డా॥కె.జోసఫ్, ఐ.ఇ.ఆర్.యఫ్ | ఒంగోలు | 1000 |
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | హైదరాబాద్ | 1000 |
| డా॥ పి. హుస్సేనయ్య | బేస్తవారిపేట | 1000 |
| రెవ. డా॥ యం.యస్.శాంతవర్ధన్ | గుంటూరు | 1000 |
| శ్రీమతి అమూల్యమ్మ | షాద్‌నగర్ | 1000 |
| రెవ.డా॥ కె.యం.జాన్ | జనగాం | 1000 |
| బ్రదర్ స్టాలిన్ | వరంగల్ | 650 |
| అపో. ఎబినెజరు | హైదరాబాద్ | 500 |
| శ్రీమతి వయలెట్ రాజకుమారి | నెల్లూరు | 500 |
| శ్రీ ప్రభుదాసు | నెల్లూరు | 500 |
| శ్రీ దేవకుమార్ | నాయుడుపాలెం | 300 |
| శ్రీమతి కె. సౌభాగ్యమ్మ | ఒంగోలు | 200 |
| శ్రీ జె. ఆనందం | ఒంగోలు | 200 |
| శ్రీమతి ఫ్లోరా | చెన్నై | 200 |
| శ్రీ కాశె వెంకటేశ్వర్లు | ఒంగోలు | 200 |
| శ్రీ షేక్ అశోక్ | నెల్లూరు | 200 |
| శ్రీమతి పావని | తెనాలి | 200 |
| శ్రీమతి పులుకూరి సుగుణమ్మ | ఒంగోలు | 150 |
| శ్రీమతి కరుణా సాగర్ | చీరాల | 150 |
| శ్రీ అబ్రాహాం | వేటపాలెం | 150 |
| శ్రీ వినయ్‌కుమార్ | వేటపాలెం | 150 |
| శ్రీ సాల్మన్‌రాజు | నర్సరావుపేట | 150 |
| డా॥ దేవదాస్ | హైదరాబాద్ | 150 |

## ఎస్.యం.ఎస్. పరిచర్య





**ఎవరికైనా ప్రతిరోజు దేవుని వాక్యము ఉచితంగా పొందగోరినచో లేదా మీ ప్రియులకు పంపగోరినచో 9908822365 నెంబరును సంప్రదించగలరు.**

ప్రతిరోజు 'హన్నాకృప' పాఠకులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు దేవుని వాక్యము SMS చేయుటకు ప్రియులు **ఎ.యన్.ఆర్.జక్కంగారు** ప్రతినెల రూ. 1000/- అందించుచున్నారు. వారికి వందనములు. ఈ పరిచర్య ద్వారా ఎంతోమంది ఆత్మీయ మేలులు పొందుచున్నందుకు దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము.

సాక్ష్యము

# పఠాన్ వలీఖాన్

కొంతకాలం క్రితం ఒంగోలు, మార్కెట్ సెంటర్‌లో నా సైకిల్ రిపేరు చేస్తున్న సుభాని క్రైస్తవ పాటను చిన్నగా పాడుకుంటున్నాడు. నీకు ఈ పాట ఎలా వచ్చు అని అడిగాను. మా మామ బొబ్బేపల్లిలో పాస్టరు అన్నాడు. అడ్రసు కనుక్కొని ఆయన సాక్ష్యము రాసుకుందామని వెళ్ళి ఆయనను కలిసినప్పుడు ఆయన తన సాక్ష్యము ఇలా చెప్పాడు.

ప్రకాశం జిల్లా మార్టూరు మండలంలోని బొబ్బేపల్లి మా స్వగ్రామము మా తండ్రిగారు పఠాన్ పెంటూఖాన్, తల్లి ఖాశింబీ. మేము ఎనిమిదిమంది సంతానము. నేను ఆరవవాడిని. మగపిల్లలలో మూడవ కుమారుడిని. మాకు మంచి వ్యవసాయము, మాగాణి, రైసుమిల్లు, పొగాకు బ్యారన్‌లు వున్నాయి.

నా చదువు బొబ్బేపల్లిలో ఎలిమెంటరీతో ఆగిపోయింది. మా యింట్లో మరెవరూ చదువుకోలేదు. అయిదవ తరగతి ముగించి రైసుమిల్లు వ్యవహారాలు చూస్తుండేవాడిని. మా తండ్రిగారు నిష్టగల ముసల్మాన్‌గా వుండి ప్రతి సంవత్సరము గారమీ చేసీ జెండా ఎత్తేవారు. పూజలకీ, భోజనాలకి ఇరవై వేలు ఖర్చు చేసేవారు. నేను కూడ మా మతంపట్ల పట్టుదల కలిగి మా తండ్రికి అన్ని విషయాల్లో చేదోడుగా వుండే వాడిని.

1980 సంవత్సరం జూలైనెలలో చీరాల దగ్గర కుంకులమర్రు గ్రామములోని నాతారున్‌భీతో నాకు వివాహ మైనది. వివాహమునకు నాకు ఒక ఎకరము మాగాణి, పది సవర్ల బంగారము ఇరవై వేలు డబ్బులు ఇచ్చారు. కొంత కాలమైన తరువాత నా నోటి వెంట పసరు పడుతుండేది. కోడిగుడ్డులోని పసుపు జనవలె వుండేది. ఏమి తిన్ననూ వాంతి అయ్యేది. నా పెండ్లి అయిన తరువాత అర్లెం పెట్టటానికి అత్తమామలు చేసిన ప్రయత్నాలు ఏవీ సాగలేదు. పదిమందిలో ఏదైనా తినాలంటే భయంగా వుండేది వాంతి అవుతుందేమో నని. అన్నం చూసినా, తినే వస్తువు ఏది చూసినా అసహ్యం కలిగేది. అందువలన మా యింటికి వచ్చేశాను.

చిలకలూరిపేటలో వున్న నా ముగ్గురు అక్కచెల్లెళ్ళ ఇంటికి కూడా వెళ్ళలేదు. మా ఊర్లో వుండే ఆర్.యం.పి. డాక్టరు మా కుటుంబ మిత్రుడు. ఆయనతో కలిసి చిలక లూరిపేట, ఒంగోలులో వున్న పెద్ద డాక్టర్లందరి వద్దకు వెళ్ళాను. మాకు డబ్బు వుంది కనుక ఎక్కడికి ఏ ఆసుపత్రికి వెళ్ళినా దండిగా డబ్బు యిచ్చేవారు మా ఇంట్లో.

గుంటూరులో మిద్దెల గోపాలకృష్ణమూర్తిగారనే పెద్ద డాక్టరుగారు రెండు రాత్రులు పగళ్ళు కడుపులోకి గొట్టము వేసి పరీక్షలు చేసి నీకు ఒంట్లో ఏ జబ్బులేదు కనుక నీకు వాంతి అవుతుందేమోనన్న అనుమానం లేకుండా భోజనం చెయ్యి అన్నారు. గుంటూరులో దాదాపు పదిమంది పెద్ద డాక్టర్లు నన్ను పరీక్ష చేసి ఏ జబ్బు లేదని చెప్పారు. అంతటితో హాస్పిటల్స్ వెళ్ళటం మానేసి దర్గాల చుట్టూ ప్రదర్శనలు చేయటం ప్రారంభించాను. నెల్లూరు వద్ద కసుమూరు వెళ్ళి అక్కడ దర్గా దగ్గర పూజలు చేశాను. దర్గా దగ్గర సమాధుల చుట్టూ ప్రదక్షిణలు చేశాను. లెక్క లేనన్ని కొబ్బరికాయలు కొట్టేవాడిని.

తరువాత అద్దంకిలో స్టార్ స్టుడియో ఆయనతో కలసి శింగరకొండలో శనివారం ఉదయం చేసే పూజలలో ఉండేవాడిని. చీరాల దగ్గర కారంచేడులో ఒక పోలేరమ్మ పూజలు చేస్తుందని తెలిసి అక్కడికి వెళ్ళాను. ఆమె ఎన్నడూ ఎరుగని వారినైనా వారి పేరు పెట్టి పిలుస్తుంది. నన్ను కూడా పేరు పెట్టి పిలిచి మీ యింటికి వచ్చి నేను పూజలు చేయాలి అన్నది. నేను నిమ్మకాయలు, పూజా సామగ్రి యింటివద్ద సిద్ధం చేసి పోలేరమ్మ భజన చేశాను. ఒక అర్ధరాత్రి 12 గంటలకు మా ఊరి నాలుగు రోడ్లు కలిసేచోట గొయ్యి త్రవ్వించి నిమ్మకాయలు, వెంట్రుకలు, పసుపు, ఇంకా ఏవేవో వేయించారు.

మా యింట్లో నా తల్లిదండ్రులు దివారాత్రములు నా విషయం నాకు తెలియకుండా ఏడ్చేవారు. నాకు పిల్లనిచ్చిన వారు బోలెడంత ఆస్తి యిచ్చి పిల్లనిస్తే పెండ్లయిన దగ్గర నుంచి వారి కుమార్తె పరిస్థితి చూసి నిత్యం ఏడుస్తుండే వారు. ఇక నా పరిస్థితి, నేను చావలేను, బ్రతకలేను. నిద్రలో కూడ వేదనే నన్ను వెంబడిస్తుంది.

మా పొలాలలో కాని, బ్యారన్‌లవద్దకాని అందరూ క్రైస్తవులే పని చేస్తుంటారు. నేను పడ్తున్న పాట్లు వాళ్ళంతా గమనిస్తూనే వున్నారే కాని యేసును గురించి నాతో చెప్పటానికి జంకారు. వారిలో పులగూర నాగమ్మ అనే ఆమె ఒకరోజు నా

దగ్గరకు వచ్చి 'అయ్యగారు మీరు అన్ని వైద్యశాలలకు వెళ్ళారు, ముస్లీం దర్గాలకు వెళ్ళారు, క్షుద్ర దేవతలు, దేవుళ్ళ దగ్గరకు వెళ్ళారు. నయంకాలేదు. ఇప్పుడు మార్టూరులో సాధు యోసేపు అనే యేసు భక్తుడు మీటింగులు జరుపుతున్నారు. అనేకులు స్వస్థత పొందుతున్నారు. మీరు కూడా అక్కడికి వెళ్ళిరాకూడదా' అన్నది.

బ్రహ్మానందరెడ్డిగారు మనకు ముఖ్యమంత్రిగా వున్న రోజుల్లో మా తండ్రిగారు కాంగ్రెస్‌వాదిగా రాజకీయాలలో చురుకుగా పాల్గొనేవారు. అప్పుడు మా తండ్రిగారి కాలు విరిగినది. స్వయాన బ్రహ్మానందరెడ్డిగారే స్వంత ఖర్చుతో హాస్పిటల్లో బాగుచేయించారు. అయితే ఎముక కట్టుకుంది కాని వాపు తగ్గటం లేదు. ఎన్నో ఆస్పత్రులలో చూపించారు. చివరికి సాధు యోసేపుగారి దగ్గరు కర్రమీద మోటుచేసు కొని వెళ్ళారు. ఆయన ప్రార్థన చెయ్యగానే ఆ కర్రను అక్కడే పడేసి నడుస్తూ ఇంటికి వచ్చాడు. ఆ సంగతి నాకు గుర్తుకు వచ్చి మా తండ్రిగారి సలహా మేరకు మార్టూరులోని సాధు యోసేపుగారి మీటింగులకు వరుసగా హాజరయ్యాను. మొదట్లో నా జబ్బు ఎక్కువగా కనిపించింది. ఏది ఏమైనా యేసుప్రభువా బ్రతికిస్తే నన్ను బ్రతికించు లేకుంటే నన్ను తీసుకో అని ఎప్పుడు ప్రార్థన చేసుకుంటూ పాటల పుస్తకం కొనుక్కొని యేసయ్య పాటలు పాడుకుంటూ వుండేవాడిని.

మా ఊర్లో వున్న బాప్టిస్టు చర్చి ఆలనా పాలనా లేకుండా వుండినది. కనీసం ఊడ్చేవారు కూడ లేరు. కరెంటు లేదు. నేను ఆరోజుల్లోనే పన్నెండు వందలు ఖర్చుపెట్టి చర్చికి కరెంటు వేయించాను. చర్చీలో పాటలు పాడేవాడిని. ఆరునెలలు సాధు యోసేపుగారి ప్రార్థనలకు వెళ్ళాక స్వస్థత వచ్చింది. మరి ఒక సంవత్సరానికి నాకు సంపూర్ణ స్వస్థత కలిగింది. అయినా నేను పూర్తిగా యేసయ్యను నమ్ముకోనట్లు గానే వున్నాను. పది సంవత్సరాలు గడిచాయి. నాకు ముగ్గురు పిల్లలు కలిగారు. 1992లో బాప్తిస్మము తీసుకో వాలి అనుకున్నాను. అప్పటి నుండి నాకు కష్టాలు ప్రారంభమైనాయి. నేను రోగినైయుండగా నన్ను ఆదుకోని వారెవరూ నా వద్దకు వచ్చేవారు. బాప్తిస్మం తీసుకొని ఇస్లాంకి దూరమవద్దు అన్నారు. అన్నీ తెలిసిన మా తల్లిదండ్రులు కూడ నా బాప్తిస్మానికి ఇష్టపడలేదు. నేను ఎటూ తేల్చుకోలేక వున్నాను.

మాది మట్టి మిద్దె. దానిని పడగొట్టి గట్టి ఇల్లు కట్టాలని పిల్లర్లు పోసి, స్లాబ్ వేశాము. పైన నీళ్ల నిలవడానికి ఏర్పాటు చేయాలని సన్నగా వర్షం పడుతుంటే గొడుగు వేసికొని మెట్లమీద పైకి వెళ్ళాను. ఇంతలో విపరీతమైన గాలి వీచింది. నేను క్రిందకి దిగుతుంటే గాలికి గొడుగు పైకిపోయింది. నేను 14 అడుగుల ఎత్తునుండి నేలమీద పడ్డాను.

క్రింద రాళ్ళు, కర్రలు ఉన్నాయి. వాటి మీద నేను పడినప్పుడు కొన్ని రాళ్ళు కర్రలు నా శరీరంలోకి గుచ్చుకున్నాయి. నేను స్పృహ కోల్పోయాను. నన్ను ఆస్పత్రిలో చేర్చారు. చనిపోవలసిన నేను బ్రతికాను. ఒక్క ఎముకైనా విరగలేదు. యేసయ్యే నన్ను ఎత్తి పట్టుకున్నాడు. నాకు జీవమిచ్చిన యేసయ్యను బహిరంగంగా ఒప్పుకోడానికి బాప్తిస్మం తీసుకోవడానికి నిర్ణయించుకున్నాను.

మరలా శ్రమలు ప్రారంభమైనాయి. ఈ లోకంలో మనుష్యులు ఏ దేవుడినైనా ఎటువంటి వారినైనా నమ్ము కోవచ్చు. వారి జోలికిరారు. మరి యేసయ్య నిజ దేవుడని ఎరిగి ఆయన కోసం సత్‌ప్రవర్తనతో జీవిస్తుంటే అందరూ అడ్డువస్తారు. మరలా గుంటూరు నుండి ఒకసారి విజయ వాడ నుండి మరికొందరు గడ్డంవారు, ముల్లావారు ఒంగోలు నుండి వచ్చి క్రైస్తవమతం తీసుకోవద్దు అని బ్రతిమాలారు, బెదిరించారు. చచ్చిన తర్వాత నిన్ను ఎత్తుకెళ్ళి స్మశానంలో పాతిపెట్టేవారు ఉండరు అని సతాయించారు. నేను అందుకు లొంగక 1992 డిసెంబరు 17న సాధు యోసేపు గారి ద్వారా బాప్తిస్మం పొందాను. నా అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు అంతా విరోధముగా వున్నారు.

నేను బాప్తిస్మం తీసుకున్న తర్వాత ప్రతి సంవత్సరం మా యింటి వద్ద బహిరంగా సభలు ఏర్పాటు చేశాను. మొదటి సభకు బాపట్ల నుండి ప్రశాంత్‌రాజుగారు వచ్చి వాక్య పరిచర్య చేశారు. అదే విధంగా ఈ పది సంవత్స రాలలో మీటింగులు పెట్టించాను. మా ఊరి బాప్టిస్టు చర్చీలో నా సాక్ష్యము విని నా వాళ్ళు ఆరుగురు బాప్తిస్మము తీసికొని సంఘములో చేర్చబడినారు. ప్రతి సంవత్సరం సభలలో పదిమంది అయినా బాప్తిస్మం తీసుకుంటారు. ఇప్పుడు ఆరాధనకు 80 మంది వస్తున్నారు. జాన్‌భీ, మస్తాన్ భీ, సాయిఖాతున్, మస్తాన్‌భీ, జయతున్‌భీ మొదలగు వారు సంఘ సభ్యులు. ప్రస్తుతం మా వూరి బాప్టిస్టు చర్చిని నేనే నడిపిస్తున్నాను. నాకు ముగ్గురు సంతానం. నాకొరకు నా సేవ కొరకు ప్రార్థించండి.

ఇట్లు
ప్రభువు సేవలో
పఠాన్ వలీఖాన్
బొబ్బేపల్లి

# ప్రయాణంలో మజిలీ

"హిందుస్తాన్ అందరిదేనన్నా - నీవు హిందువన్నా, ముస్లీంవన్నా, హిందూస్తాన్ మన అందరిదేనన్నా - క్రైస్తవుడా నేనన్నా, సిక్కు, పార్శీ నేనన్నా" అనే పాట మద్రాస్ ఐ.బి.యల్.లో చిరంజీవిగారు మాకు నేర్పినప్పుడు, ఈ పాట రాసిన జాన్‌గారిని చూడాలని 1994లోనే అనుకున్నాను.

నా మొదటి రచన మడిమెను పట్టుకొనినవాడు పరిచయమును ఆరార్కేమూర్తిగారు వ్రాశారు. ఆ రోజుల్లో చిరంజీవిగారు, కమలా చిరంజీవిగారు మనందరిలో ఒకరిగా జీవించేటప్పుడు నా రెండవ పుస్తకం 'జప్నత్వ నేహు'కు కమలా చిరంజీవిగారు పరిచయము వ్రాశారు. మూడవ పుస్తకమునకు పరిచయము వ్రాయటానికి ఎవరినైనా ఎన్నిక చేయమన్నప్పుడు జనగాంలోని కె.యం.జాన్‌గారి పేరు వారు సూచించారు. జాన్‌గారికి తీరుబడిలేక చాల నెలల వరకు ఆగి తర్వాత చాల ఎక్కువగానే వ్రాసి 1997 జూలై 27న నాకు పంపించారు.

1998లో నేను హైదరాబాద్ నుండి శ్రీ కె.యం.జాన్ గారిని చూడటానికి జనగాం వెళ్ళాను. కాని వారితో పది నిమిషాలు మాత్రమే మాట్లాడగలిగాను. ఆయన ప్రార్థనకు వెళ్తూ హడావిడిగా నా చేతిలో వందరూపాయల కాగితం పెట్టారు.

వారు నివశిస్తున్న భవనం శిథిలావస్థలో వున్న మిషన్ బంగళా. వారు ధరించిన దుస్తులు పేదవారు ధరించేవిగా కనిపించాయి. అంతేకాక వందరూపాయలు ఆయన చేతిలో వుండేటంతటి వాడు కాకపోయినా ఆ రోజుల్లో వంద రూపాయల నోటుకు వున్న విలువను మించిన ఆయన దాతృత్వం మరువ లేనిది.

తర్వాత పది సంవత్సరాలు గడచిపోయాయి. వారి అడ్రసుకాని, ఫోన్ నెంబరుకాని నా దగ్గరలేదు. అందువలన మరచిపోలేని ఆయన వ్యక్తిత్వాన్ని గుర్తు చేసుకొనుచుండగానే రోజులు సంవత్సరాలైనా వారిని చూడాలన్న కోరిక మాత్రం నాలో ఎదుగుతూనే వచ్చింది.

రాజస్థాన్ నుండి వరంగల్‌కు బదిలీ అయి సేవచేసున్న దైవజనుడు స్టాలిన్‌గారి ఆహ్వానము మేరకు- ఆచార్య ఆరార్కే మూర్తిగారిని సువార్త సభలకు ఆహ్వానించమని నన్ను ప్రేరేపించిన స్థానిక సువార్తికుల వలన హైదరాబాద్ ప్రయాణమై దారిలో జనగాం వెళ్ళి శ్రీ కె.యస్.జాన్ గారిని చూడాలని నిర్ణయించు కున్నాను.

మధ్యాహ్నం మంచి ఎండలో బస్ జనగాం సమీపిస్తుండగా బస్ కండక్టర్‌ని ప్రిన్స్‌టన్ వెళ్ళటానికి బస్ ఎక్కడ దిగాలి అని అడిగాను. బస్టాండు ప్రక్కన అన్నాడు. బస్ దిగినప్పుడు ఎన్నో ఆలోచనలు. 11 సంవత్సరాల క్రితం నేను చూసినప్పుడు ఆయన 70 సంవత్సరముల వయస్సు వాడిలా కనిపించాడు. ఇప్పుడు ఆయన ఎక్కడ ఉన్నాడో అని ఆలోచిస్తూ నా ఎదురుగా మోటారు సైకిలు మీద కూర్చుని వున్న ఒక యౌవనస్తుని జాన్‌గారు ఎక్కడ వుంటారు అని అడిగాను. కె.యం.జాన్‌గారా? వేరే జాన్‌గారా? అన్నాడు. కె.యం.జాన్‌గారు అన్నాను. కుడిప్రక్కకు తన చేయి చాపి అదిగో ఆ మూడంతస్థుల క్రొత్త మేడ ఆయనదే అన్నాడు. మరి ఆ పాత మిషను బంగళా ఎక్కడ వుంది అని కళ్ళతో వెదికాను కాని కనబడలేదు.

ఆ మోటారు సైకిలు యవనస్తుడే నన్ను వెనక ఎక్కించుకొని జాన్‌గారి క్రొత్త బంగళా గేటువద్ద వదలి వెళ్ళాడు. గేటు తలుపు తెరిచాను. ఎదురుగా స్కార్పియో కారు క్రొత్తది కనిపించింది. ఎడమ ప్రక్కన పదిమంది దైవజనులు భోజనము చేస్తున్నారు. చాలమంది చిన్నపిల్లలు వారికి దూరంగా ఎవరి పనిలో వారున్నారు. ఏదైనా మీటింగ్ జరుగుతుందా అని అక్కడ నిలబడ్డ ఒక వ్యక్తిని అడిగాను. మీటింగా? అని ఆశ్చర్యంగా నావైపు చూచి మరలా చుట్టూ చూసి నవ్వి ప్రతిరోజూ ఇక్కడ ఇలాగే వుంటుంది అన్నాడు.

జాన్‌గారి కొరకు వచ్చాను అన్నాను. ఎదురుగా ఆఫీసులో అమ్మగారు వున్నారు అన్నాడు. స్కార్పియో దాటితే పెద్ద ఆఫీసు. జాన్‌గారి భార్య పెద్ద టేబుల్ దగ్గర కూర్చుని ఫైల్స్ చూస్తున్నారు. లోపలికి వెళ్లి నమస్కరించి ఒంగోలు నుండి వచ్చాను అన్నాను. మీరు ముందు భోజనంచేసి రండి అన్నారు. వరంగల్‌లో భోజనం చేశాను అన్నాను. పరవాలేదు చాల సమయం గడిచింది. ముందు భోజనం చేసి రండి అన్నారు. ముందు అయ్యగారిని చూస్తాను అన్నాను. అయితే కూర్చోండి అన్నారు. అయిదు నిమిషాల్లో జాన్ అయ్యగారు ఎవరితోనో కలసి మాట్లాడుకుంటూ లోనికి వచ్చారు. నేను లేచి పలకరించాను. ఆయన నన్ను పరీక్షగా ఆలోచిస్తూ చూస్తున్నాడు. మీరు నన్ను గుర్తు పట్టలేరు అన్నాను. ఆయన ఒక నిమిషం ఆగి 'ఆసెనతు' అన్నాడు. నేను ఆశ్చర్యపోయాను. ఆశ్చర్యపోవడానికి కారణం 11 సంవత్సరాల క్రితం నేను చూసిన జాన్‌గారి కంటే 10 సంవత్సరాల వయస్సు తగ్గిన జాన్‌గారిని ఇప్పుడు నేను చూస్తున్నాను. ఆయన భార్యగారు కూడా అలాగే వున్నారు. ఆయన మాట్లాడుతూ 1960లో బైబిల్ మిషన్ నాకు ఇచ్చిన స్కాలర్‌షిప్‌తో వి.బి.యస్. ప్రారంభించాను. నా స్కాలర్‌షిప్‌తో

ప్రారంభించి 48 సం॥లు పూర్తి అయ్యాయి. పోయిన సంవత్సరం ఆరు లక్షల మంది పిల్లలకు వాక్యము అందించాము. ఈ సంవత్సరం పది లక్షల మంది పిల్లలకు పుస్తకాలు అందించి వారి ఆత్మీయ జీవితాన్ని మేలుకరంగా ముగిస్తాము. తెలంగాణా ప్రాంతములోని పది జిల్లాలలో ఈ పని వ్యాపించింది.

పది సంవత్సరాల క్రితం మీరు వచ్చినప్పుడు ఇలా లేదు. నేను పది లక్షలమంది పిల్లలకు వాక్యము ప్రకటించే విధంగా ప్రభువును ప్రార్థించాను. ఆయన నా ప్రార్థన ఆలకించి నాకు వాగ్దానము చేసి నెరవేర్చాడు. ఇన్ని ఎండ్లుగా అవిచ్ఛిన్నంగా పని సాగించాడు. అనేకమంది నాయకులను లేపాను. నా 70వ సంవత్సరములో ప్రకాశించాను అన్నారు. ప్రార్థన చేసి కానుక ఇచ్చి నన్ను సాగనంపాడు.

యెహోవా కొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు. వారు పక్షిరాజువలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు. అలయక పరుగెత్తుదురు. సొమ్మసిల్లక నడచి పోవుదురు.

★ ★ ★ ★

నా రెండవ తమ్ముడు పాస్టరు విజయచంద్ర తన భార్య మంజులతో కలసి బెంగుళూరులో దాసరహళ్ళిలో సువార్తసేవ ప్రారంభించినప్పుడు భయంకరమైన అవరోధాలు, ప్రాణభయం కలిగినవి. అయినను ప్రభువునందలి విశ్వాసముతో నిలకడగా సేవచేసి ఆ ప్రాంతంలో జయకరమైన సేవ కొనసాగిస్తున్నారు.

నాలుగు సంవత్సరాల క్రితం వెస్ట్‌గోదావరి నుండి మృత్యుంజయరావు అనే యౌవనస్థుడు ప్రభువు వలన ప్రేరేపితుడై ఇద్దరు సంతానముతో బయలుదేరి బెంగుళూరు వచ్చి విజయచంద్రగారితో కలిసి సేవలో సహకరించ సాగాడు.

బెంగుళూరు, దాసరహళ్ళి, హన్నాకృప మందిరంలోని ఒక విశ్వాసి అనంతపురం జిల్లా కదిరి తాలూకా ఓడిసి మండలం చుట్టుప్రక్కల ఏ గ్రామములోనైనా ఒక్క సువార్తికుడైనా లేదని యేసు నామమెరిగిన వాడు ఒక్కడైనా ఆ గ్రామములో లేరని చెప్పినందున మృత్యుంజయరావు గారిని కొండకమర్ల గ్రామంలో ఒక ఇల్లు అద్దెకు తీసికొని అందుండి సేవ ప్రారంభించారు.

ఓడిసి మండలంలో దవురువారిపాలెంలో ప్రభువు వలన ప్రేరేపించబడిన ప్రభువు బిడ్డ వలన కొంత పొలము కానుకగా ఇవ్వబడింది. పాస్టరు విజయచంద్ర దంపతులు ప్రభువు వలన ప్రేరేపితులై 2008 మే 20 నుండి 24 వరకు యౌవనస్థుల కూడికలు జరిగించాలని ముందుగా నన్ను ఆ ప్రాంతమును దర్శించి సూచనలు చేయాలని కోరారు.

మే 9వ తేది ఉదయం 4 గంటలకు కదిరి చేరి 20 కిలో మీటర్లు బస్‌లో ప్రయాణించి ఒక అడ్డరోడ్డు వద్ద బస్‌దిగి 17మందితో నిండిన ఒక ఆటోలో 9 కిలో మీటర్లు ప్రయాణించి కొండకమర్ల చేరాను. గ్రామశివారులో ప్రదర్శనలు నిలిచిపోయిన ఒక సినిమా హాలు కాంపౌండులో 'హన్నాకృప మెమోరియల్ చర్చస్' వారి ప్రార్థన కూటాలు జరుగుచున్నవి. ముఖ్యప్రసంగీకులుగా ఏలూరు పట్టణ వాసి దైవాభిమాని దవురువారిపాలెం వెళ్లి పరిసరాలను సమీక్షించి ఒంగోలు వచ్చాను. మరలా 19వ తేదీన పదిమంది యౌనస్తులు నావెంట రాగా 16 గంటలు ప్రయాణం చేసి అర్ధరాత్రి వేళ దవురువారిపాలెం చేరాము. కరెంటు లేదు, అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఆ రాత్రి అక్కడ నేలమీద నిద్రించి ఉదయాన్నే చూస్తే మా చుట్టూ సమాధులే. వాటి మధ్యలో మేమున్నాము. అక్కడి సమాధులన్నీ ఆరడుగల పొడవు, నాలుగడుల వెడల్పు, మూడడుగుల ఎత్తులో అరుగులవలె కనిపించాయి.

'యూత్ క్యాంప్'కు సంబంధించిన పోస్టర్లుకాని, బ్యానర్లు కానీ ఏవీ కనిపించలేదు. మృత్యుంజయరావుగారిని పిలిచి కారణం అడిగాను. ఎనిమిదవ తారీకున జరిగిన సువార్త సభల అనంతరం మతతత్వ భావాలు కలిగిన స్థానికులు కొందరు పాస్టరుగారిని బహుగా వేధించి, ఇకమీదట క్రైస్తవ మతము గురించిన ఎటువంటి కదలికను సహించుమని హెచ్చ రించారని చెప్పాడు. మైకు శబ్దం వినబడకూడదని హెచ్చరించారు. బెంగుళూరు నుండి, ఒంగోలు నుండి వచ్చిన యౌవనస్తులతో కలసి వచ్చిన వారందరు అక్కడే సభలు నిర్వహించాలని ప్రభువునుబట్టి ధైర్యముగా నిశ్చయించుకున్నారు.

ప్రభువు ఈ లోకము నుండి పరమునకు వెళ్లి రెండువేల సంవత్సరములు గడచినప్పటికీ 'యేసు' అనే పేరు తెలియని గ్రామ ప్రజలు నివశిస్తున్నారు. నాకు చాల ఆశ్చర్యము, దుఃఖము కలిగాయి. కరపత్రములు సువార్తలు పంచిపెట్టాము. పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తులు తప్పితే ప్రభువు సువార్త కొరకై అక్కడి ప్రజలు ఆకలిగొనియున్నారు. కాని ఏలూరు నుండి వచ్చిన మృత్యుంజయరావు అతని భార్య కలసి ప్రభువు కొరకు సంపాదించిన ప్రజలే అక్కడ సువార్తికులుగా మారాలని ప్రభువును ప్రార్థించాము.

ఒంగోలు పట్టణ పరిసర ప్రాంతాల్లో ఇంటింట సేవ చేస్తూ ఫిల్మ్ మినిస్ట్రీ, కరపత్రముల సేవ చేస్తున్న ఆపరేషన్ మొబలైజేషన్ టీము సభ్యులు సునీల్, జ్యోతి, సీమ అనే యౌవనస్తులు మాతో కలిసి రాత్రి సమయములందు ఫిల్మ్ మినిస్ట్రీ చేసి ఎంతో దీవెనకరంగా వున్నారు.

2009లో మరలా హన్నాకృప మెమోరియల్ చర్చస్ ద్వారా ఓడిసి మండలంలోని ప్రతిగ్రామంలో ఒక సువార్తికుడు, ఒక మందిరము ఏర్పాటు తమ ఆశయంగా ప్రభువును ప్రార్థిస్తున్నాం. మంజుల, విజయచంద్ర దంపతులు హన్నాకృప పాఠకులు వారి ప్రార్థనలో జ్ఞాపకము చేసికొనమని కోరారు.

# సువార్తలలోని యేసు కథ



యేసు అనే మాట తన నోట నుండి వెలువడింది. తన నోట నుండి వెలువడిన ఆ మాట తనకే క్రొత్తగా అనిపించింది. ప్రక్కింటి వారు వచ్చారు. దూరం నుండి తనను చూస్తూ వాదించుకుంటున్నారు. వారికి మరికొందరు తోడై మాట్లాడు కుంటున్నారు. వారు తనను గురించే మాట్లాడుకుంటున్నారు. ఇంతకు ముందు తనను గురించి ఎవరూ మాట్లాడుకోలేదు. యేసు తనను ముట్టినందున తను పూర్వమువలె ఒక వస్తువు కాదు. తనూ ఒక మనిషి అయ్యాడు.

వీడే అని కొందరు, వీడు కాదు వీడిని పోలినవాడు అని కొందరు పెద్దగానే మాట్లాడుకుంటున్నారు. ఔను బురద తన కన్నుల మీద పూయక ముందు-ప్రపంచంలో నేను ఉన్నంత కాలం దానికి వెలుగును అన్నాడు యేసు. ఆయన వెలుగు తన మీద పడింది. తను ఇప్పుడు జనానికి కనబడు తున్నాడు. ఇంకా జనం పోగవుతున్నారు. త్వరత్వరగా నడుస్తూ వారి మధ్యకు వెళ్ళాడు. ఇప్పుడు తను నడిచేటప్పుడు తన చూపే తన నడకకు సమతూకం కలిగిస్తుంది.

నేనే అతన్ని అని అందరి కళ్ళలోకి చూశాడు. నేనే అతన్ని అన్న మాట పలికిన తీరు తనకే ఆశ్చర్యం కలిగించింది. ఎదురు వీధిలో వుండే పెద్దమ్మ గబగబ దగ్గరికి వచ్చి తన కళ్ళలో కళ్ళు పెట్టి పరీక్షగా చూస్తూ సంతోషంగా మరి అలాగైతే నీకు దృష్టి ఎలాగ వచ్చింది అని అడిగింది.

యేసు అని పిలుస్తారే ఆయన బురదచేసి నా కళ్ళ మీద పూశాడు. తరువాత నన్ను వెళ్ళి సిలోయమనే కోనేటిలో కడుక్కోమన్నాడు. నేను అలాగే వెళ్ళి కడుక్కున్నాను. తర్వాత నాకు దృష్టి వచ్చింది అన్నాడు. ప్రక్కన ఎవరో తన భుజం మీద చెయ్యి వేశారు. అటు తిరిగి చూశాడు. అతనెక్కడ ఉన్నాడు అని చేసైగతో అడిగాడు. నాకు తెలియదు అని లోనికి వెళ్లిపోయాడు.

ఆ వీధిలోని వారు అవతల వీధిలో వున్న శాస్త్రులు కొందరు ఇంటికి వచ్చారు. 'ఒక సబ్బాతు దినాన వైద్యము ఎలా చేశాడు. బురద ఎలా తయారు చేశాడు?' అని అంటున్నాడు ఒక శాస్త్రి. 'అసలు ఆ గుడ్డి వాడిని పిలవండి' అని ఎవరో అరిచారు. ఇవన్నీ విని బయటకు వచ్చాడు. ఇంతకుముందు వీరి మాటలు వింటూనే వున్నాడు కాని ఎవరిని చూచి ఉండలేదు. ఇప్పుడు చూస్తున్నాడు. కనుక మాటలు జాగ్రత్తగా విననవసరము లేదు.

పరిసయ్యుల దగ్గరకు వెళ్దాము రా అని వారిలో ఒక పొడవాటి వ్యక్తి అతనికి సైగచేశాడు. సరే ఇప్పుడు పరిసయ్యులను కూడ చూడవచ్చును అనుకుంటూ నడిచాడు. అంటోనియో గోడ ప్రక్కగా ప్రధానయాజకుని ఇంటి ప్రక్కన వున్న సావడిలో పరిసయ్యులు రాతి ఆసనము మీద కూర్చుని వున్నారు.

నీకు దృష్టి ఎలా వచ్చింది అని అడిగారు. బొత్తిగా మర్యాద తెలియని వారివలె కనిపించారు. యేసు మాటలలో ఎంతో మృదుత్వము వుంది. పరిసయ్యుల ప్రక్కన వున్న వారి శిష్యులు తనని పరీక్షగా చూస్తున్నారని గమనించాడు. మనుష్యుల కండ్లు అన్నీ ఒకే రకంగా వున్నప్పటికీ అవి వేరు వేరు భాషలను, భావాలను బయల్పరుస్తాయని ఇప్పుడే తెలుసుకున్నాడు. తను గ్రుడ్డివాడుగా వున్నప్పుడు మనిషి స్వరమునుబట్టి అతను ఎటువంటి వాడో బేరీజు వేసికొనే వాడు. అందువలన తన హృదయం ఎన్నడూ యథార్థం గ్రహించలేకపోయింది. తనకు యేసు కళ్ళు ఇచ్చిన తర్వాత ప్రపంచమంటే ప్రజల కళ్ళు అని అవి ఎంత మృదువుగా వుంటాయో అంత కఠినమైనవని పరిసయ్యులను వారి శిష్యులను చూసిన తర్వాత అర్థమైంది. అందరి కన్నుల వైపు వరుసగా తన కళ్ళను త్రిప్పుతూ 'ఆయన నా కన్నుల మీద బురద ఉంచగా నేను కడుగుకొని చూపు పొందితిని' అన్నాడు.

పదిమంది దాక వయసు మళ్ళిన వారు పదిమంది నడివయస్కులు కూర్చుని వున్నారు. ప్రతి వృద్ధ పరిసయ్యునికి కొందరు యౌవన శిష్యులు వున్నారు. బాగా డబ్బున్న వానివలె వస్త్రధారణ అయిన వ్యక్తి లేచి 'ఈ మనుష్యుడు విశ్రాంతి దినమునాచరించుటలేదు గనుక దేవుని యొద్ద నుండి వచ్చినవాడు కాదు' అన్నాడు. అతని ప్రక్కనున్న ఇద్దరు కూడ లేచి 'అంతే.. అంతే' అన్నారు. వెనుక కూర్చున్న నడికారు

వ్యక్తి లేచి 'ఇతడు పాపాత్ముడైతే ఇలాంటి అద్భుతాలు చెయ్యగలడా?' అన్నాడు. అతని ప్రక్కనున్న ఇద్దరు ముగ్గురు 'ఔనని' తలలూపారు. కొంచెంసేపటిలో వారంతా రెండు వర్గాల వారివలె ముందు చిన్నగా మాట్లాడుకొని చివరకి పెద్దగా అరుచుకోవటం ప్రారంభించారు.

వాళ్లు నోటితో అరుచుకుంటున్నారా? కండ్లతో అరుచుకుంటున్నారా అని ఆలోచించసాగాడు నిశ్శబ్దంగా కదలకుండా నిలబడి వున్నాడు. 'నీవు అతని గురించి ఏమనుకుంటున్నావు' అన్న మాటతో మరలా మనుష్యుల దగ్గర వున్నాను అనుకొని అవును నేనెన్నడూ ఈ విషయం ఆలోచించలేదు కదూ యేసు ఎవరు? అని తనలో తాను అనుకొని 'ఆయన ఒక ప్రవక్త' అని పెద్దగానే అన్నాడు. అంతా నిశ్శబ్దం. పరిసయ్యులలో ఒకరు 'నీకు తల్లిదండ్రులు వున్నారా?' అని అడిగాడు. అతను తన వెనుకనున్న జనంవైపు తిరిగి చూసి 'ఉన్నారు' అన్నాడు.

'వారిని ఇలా రమ్మను' అని అనగా అతని తల్లిదండ్రులు ముందుకు వచ్చారు. కాని వారి ముఖం చూసినప్పుడు ఆశ్చర్యపోయాడు. నా తల్లిదండ్రులు ఎందుకు ఇలా భయపడుతున్నారు. ఇంతకుముందే కదా వారి కళ్ళలో ఆనందం చూసింది. ఇప్పుడు వారి కళ్ళలో భయం చూస్తున్నాడు.

'ఇతడు మీ కుమారుడా?' అన్నాడు ఆ పెద్దాయన. వారు ఆయనవైపు భయంగా చూశారు. 'గ్రుడ్డివాడుగా జన్మించింది ఇతడేనా?' అన్నప్పుడు వారు ఔనన్నట్లు తలలూపారు. 'ఇతడు ఇప్పుడెలా చూడగలుగుతున్నాడు?' అన్నాడు. కొంచెంసేపు నిశ్శబ్దం. తల్లిదండ్రులు ఒకరి కళ్ళతో ఒకరు మాట్లాడుకుంటున్నారు.

తన తండ్రి కొంచెం ముందుకు వచ్చి 'ఇతడు మా కుమారుడని, గ్రుడ్డివానిగా జన్మించాడని మాకు తెలుసు. కాని ఇతడేలాగున చూడగలుగుతున్నాడో, ఇతనికి దృష్టి ఎవరిచ్చారో మాకు తెలియదు. అతన్నే అడగండి. తనను గురించి సమాధానము చెప్పుకోగల వయస్సు అతనికి వుంది' అన్నాడు.

మరలా ఆ పెద్ద వయస్సున్న పరిసయ్యుడు ముందుకు రమ్మని సైగజేసి 'దేవుణ్ణి స్తుతించు, అతన్ని కాదు. అతడు పాపాత్ముడని తెలుసు' అని తనతో అంటుంటే ఇప్పుడు నిజంగా వీరు మనుష్యులేనా? కండ్లుండి గ్రుడ్డివారా? అనుకుంటూ 'ఆయన పాపాత్ముడో కాదో నాకు తెలియదు' అని అందరివైపు చూస్తూ 'నాకు ఒకటి తెలుసు. నేను ఇది వరకు గ్రుడ్డివాడ్ని ఇప్పుడు చూడగలుగుతున్నాను' అని నా కళ్ళు చూడండి అన్నట్లుగా కళ్ళు పెద్దవి చేసి అందరివైపు చూశాడు.

మధ్యలో కూర్చున్న పరిసయ్యుడు విసుకుగా లేచి 'అతడు ఏమి చేశాడు. ఏ విధంగా నీకు దృష్టి కలిగింది' అని అడిగాడు. అతను అతను అంటారేంటి, యేసు అనరేమిటి అని మనసులో విసుక్కొని 'నేను ఇదివరకే చెప్పాను. కాని మీరు వినలేదు. మళ్ళీ ఎందుకు అడుగు తున్నారు?' అని ఆగి 'మీరు కూడా ఆయన శిష్యులు కావాలని అనుకుంటున్నారా?' చిరునవ్వు నవ్వినట్లుగా చూశాడు.

వెంటనే వారి శిష్యుల గుంపులో నుండి ఒకడు ముందుకు వచ్చి 'నువ్వే అతని శిష్యుడవి, మేము మోషే శిష్యులము' అంటూ మోషే అనే మాటను గట్టిగా పలిగాడు. వాని ప్రక్కన వున్న మరో శిష్యుడు 'దేవుడు మోషేతో మాట్లాడాడని మాకు తెలుసు. ఇక ఇతని గురించా? ఇతనెక్కడి నుండి వచ్చాడో కూడా మాకు తెలియదు' అన్నాడు.

'ఇది చాలా విచిత్రంగా వుంది. అతనెక్కడి నుండి వచ్చాడో కూడా మీకు తెలియదా?' అని ఆగి ఆ పెద్ద పరిసయ్యుని వైపు చూస్తూ 'అయినా ఆయన నాకు దృష్టి కలిగించాడు' అని అందరి వైపు చూస్తూ 'దేవుడు పాపాత్ముల మాటలు వినడని, ఆయన ఆజ్ఞలు పాటిస్తున్న విశ్వాసుల మాటలు వింటాడని మీకు తెలుసు. పుట్టుగ్రుడ్డివాని కన్నులు తెప్పించటం ఇదివరకు ఎవ్వరూ వినలేదు' అని ఏదో జ్ఞప్తికి వచ్చిన వానివలె ఆలోచించి 'ఇతడు దేవుని యొద్ద నుండి రానట్లయితే ఏమి చేయలేకపోయేవాడు' అని అన్నాడు. వెంటనే ఆ పెద్ద పరిసయ్యుడు కోపంతో మండిపోతూ 'నీవు పాపంలో పుట్టావు, పాపంలో పెరిగావు. మాకు ఉపదేశించటానికి నీకెంత ధైర్యం' అని తన ప్రక్కనున్న వారివైపు చూసి ఏదో చెప్పాడు. మరో ఇద్దరు కూడి మాట్లాడుకున్నారు. 'నిన్ను మేము యూదా సంఘములో నుండి వెలి వేస్తున్నాము. బయటకు వెళ్ళు' అన్నారు.

# ఏది నిజము? ఏది అబద్ధము? ౨

**(లోకానికి బైబిల్ సవాల్)**

హేతువాదుని ప్రశ్న - 5

**యెహోవా పేరు తెలియకపోతే?**

ఆది. 22:14 'అబ్రాహాము ఆ చోటికి యెహోవా యీరే అను పెట్టెను. అందుచేత యెహోవా పర్వతము మీద చూచుకొనును అని నేటి వరకు చెప్పబడెను'.

నిర్గ. 6:2-3 'మరియు దేవుడు మోషేతో ఇట్లనెను - నేనే యెహోవాను; నేనే సర్వశక్తిగలదేవుడను పేరున అబ్రాహాము ఇస్సాకు యాకోబులకు ప్రత్యక్షమైతినికాని, యెహోవా అను నా నామమున నేను వారికి తెలియబడలేదు (పాతనిబంధనలో దేవుడిని హిబ్రూ భాషలో యెహోవా అని చెప్పబడియున్నది. చూడు ఆది. 2:4, దేవుడైన యెహోవా..'.

**జవాబు :** "యెహోవా యీరే", అనగా దేవుని పేరు మీద. ఆయన నామము తెలిసి ఈ పేరు పెట్టలేదు, తన కుమారుడు రక్షింపబడి తన దివ్యబలి విజయవంతముగ నెరవేర్చిన దేవుని ఆత్మ ఎల్లప్పుడు జీవప్రదాతగా ఇందు నివసించుచున్నదను భావముతో ఆ పేరు పెట్టినాడు. ఇందుకు ఉదాహరణ న్యాయాధిపతులు 15:16లో (రామతురహి) అని సంసోను గాడిద దవడ ఎముకతో శత్రువులను చంపిన ప్రదేశమునకు ఆ పేరు పెట్టెను. అంత మాత్రమున అది రాముని పేరు అని అనుట పొరపాటు కదా! మోషే సృష్టి చరిత్ర రాశాడు కనుక ఆది. 2:4లో యెహోవా అని వ్రాశాడు. దానిలో మోషేకు దేవుని పేరు యెహోవా అని తెలియదు అని చెప్పబడలేదు కదా!

హేతువాదుని ప్రశ్న - 6

**75 లేక కనీసం 130 ఏది ఖాయం?**

ఆది. 11:26,32 "తెరహు డెబ్బదియేండ్లు బ్రతికి అబ్రామును నాహోరును హారానును కనెను. ...తెరహు బ్రతికిన దినముల రెండువందల యైదేండ్లు బ్రతికిన దినములు రెండువందల యైదేండ్లు. తెరహు హారానులో మృతి చెందెను.

ఆది. 12:4 'అబ్రాము హారాను నుండి బయలు దేరినప్పుడు డెబ్బదియైదేండ్ల యీడు వాడు.

అపొ. 7:4, "అతని తండ్రి చనిపోయిన తరువాత, అక్కడ (హారాను) నుండి మీరిప్పుడు కాపురమున్న యీ దేశమందు నివసించుటకై దేవుడు (అబ్రాహామును) తీసికొని వచ్చెను" (135 సంవత్సరములు జీవించిన తరువాత అబ్రాహాము 75 సంవత్సరముల వాడు).

ప్రశ్నలోని సారాంశము:- తండ్రి చనిపోవు నాటికి అనగా అబ్రాము హారాను నుండి బయలు దేరునాటికి అతనికి కనీసము (205-70-135 ఏండ్లు).

**జవాబు:** మొదట హారాను నుండి బయలుదేరినప్పుడు 75 ఏండ్ల వయస్సు - 'కాపురము మార్చి ఈ దేశములో నివసించుటకు బయలుదేరి వచ్చునప్పుడు 130 ఏండ్ల ఈడుగలవాడు.

హేతువాదుని ప్రశ్న - 7

**ఇస్సాకు అబ్రాహాము యొక్క ఒకే ఒక్క కుమారుడైతే ఇష్మాయేలు మరియు కెతూరా కుమారులు ఎక్కడ నుండి వచ్చిరి?**

హెబ్రీ. 11:17 "అబ్రాహాము శోధింపబడి విశ్వాస మును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను....ఆ అబ్రాహాము, మృతులను సహితము లేపుటకు దేవుడు శక్తిమంతుడని యెంచినవాడై, తన యేక కుమారుని అర్పించి ఉపమాన రూపముగా అతనిని మృతులలో నుండి మరల పొందెను".

గలతి. 4:22 "దాసి వలన ఒకడును స్వతంత్రురాలి వలన ఒకడును ఇద్దరు కుమారులు అబ్రాహామునకు కలిగిరని వ్రాయబడియున్నది గదా?"

ఆది. 16:15, "తరువాత హాగరు అబ్రామునకు కుమారుని కనెను".

**జవాబు :** హెబ్రీ. 11:17లో అబ్రాహాము ఇస్సాకును బలిగా అర్పించెను. కాని దేవుడు వాగ్దానము వలన తిరిగి మరల అబ్రాహాము ఇస్సాకును పొందెను. అయితే ఈ వాక్యములో ఇస్సాకును అబ్రాహాము యొక్క ఏకైక కుమారుడు అని వర్ణించియున్నాడు. అయితే అబ్రాహాముకు హాగరు అను దాసి వలన ఇస్సాకు కన్నా ముందే ఇష్మాయేలును కనెను ఆది. 16:15.

హేతువాదికి అబ్రాహాము యొక్క ఏకైక కుమారుడు అన్న విషయములో సంశయము ఏర్పడి, ఈ వాక్యాలను అసందర్భాలలో చేర్చాడు. ఈ హేతువాదికి జ్ఞానము బొత్తిగా లేనట్లుగా ఈ వాక్యాలనుబట్టి ఋజువు అగుచున్నది.

ఎందుకంటే అబ్రాహామునకు స్వతంత్రురాలి వలన ఇస్సాకు దాసి వలన ఇష్మాయేలు పుట్టెను.

గలతి. 4:22లో వలె, స్వతంత్రురాలి కుమారుడు వారసుడగునుగాని, దాసి వలన పుట్టిన కుమారుడు వారసుడుగాడు. అంతేకాదు స్వతంత్రురాలి వలన పుట్టిన కుమారుడు దేవుని వాగ్దానము వలన పుట్టిన వాడు. ఈ కుమారుడు అబ్రాహామువలె దేవునిలో ఎన్నిక కాబడి ఇశ్రాయేలు జనాంగమునకు మూలపురుషుడయ్యెను.

అందువలన ఇస్సాకును హెబ్రీయులకు రాసిన పత్రికలో ఏకైక కుమారుడు అని వర్ణించాడు. రాజ్య సింహాసనమునకు వారసుడు ఎవరు? పట్టపు రాణికి పుట్టిన కుమారుడు కాదా?

హేతువాదుని ప్రశ్న - 8

**భార్యనా లేక ఉంపుడుగత్తె. ఏది ఖచ్చితం?**

ఆది. 25:1 "అబ్రాహాము మరల ఒక స్త్రీని వివాహము చేసికొనెను, ఆమె పేరు కెతూరా".

1దిన. 1:32 "అబ్రాహాము యొక్క ఉపపత్నియైన కెతూరా కనిన కుమారులు ఎవరనగా జిమ్రాను యొక్షాను మెదాను మిద్యాను ఇష్బాకు షూవహు".

**జవాబు :** ఆది. 25:1లో కెతూరా అను స్త్రీని అబ్రాహాము వివాహము చేసికొనెను. కాని ఈమె వారసురాలు కాదు. ఎందుకంటే అబ్రాహాము యొక్క స్వతంత్రురాలైన భార్య శారా కనిన కుమారుడు ఇస్సాకు దేవుని వాగ్దానము వలన పుట్టినవాడు. శారా మరణాంతరము అబ్రాహాము కెతురా అను స్త్రీని వివాహము చేసుకొని జిమ్రాను, యొక్షాను, మెదాను, మిద్యాను, ఇష్బాకు, షూవహు అను వారిని కనెను. మన సమాజములో ఇటువంటి స్త్రీలకు విలువలేదు. అదే విధంగా ఆనాటి కాలములో కూడా మొదటి భార్యకు వున్న విలువ తరువాతి వారికి లేదు. అందుకు దాసికి పుట్టిన బిడ్డ అయిన ఇష్మాయేలును తన నుండి శారా మాటలకు విలువనిచ్చి వారిని పంపివేశాడు. అయితే కెతూరా విషయం వచ్చేసరికి శారా మరణించి యున్నది. అయినప్పటికీ కెతూరా యొక్క స్థానము శారా యొక్క స్థానమునకు సరిపోదు. ఎందుకంటే ఎవరైనా మొదట స్వతంత్రురాలైన భార్యకు ఇచ్చు విలువ రెండవ భార్యకు ఇవ్వరు. అందుకనే 1దిన. 1:32లో ప్రవక్త అబ్రాహాము ముదుసలి జీవితములో భార్యయైన కెతూరాను ఒక ఉంపుడుగత్తెగా ఇంగ్లీషు బైబిలునందు వర్ణించాడు. అటు తరువాత వారికి పుట్టిన సంతానమును కూడ వర్ణించాడు. కాబట్టి, ఇటువంటి సంతానమునకు దేవుని దృష్టిలో ఎన్నిక లేదని మనము గ్రహించాలి.

హేతువాదుని ప్రశ్న - 9

**స్వాస్థ్యమా? స్వాధీనమా? ఏదీ కాదా?**

ఆది. 17:8 "నీకును నీ తరువాత నీ సంతతికిని నీవు పరదేశివైయున్న దేశమును, అనగా కనానను దేశమంతటిని నిత్యస్వాస్థ్యముగా ఇచ్చి వారికి దేవుడనై యుందునని (అబ్రాహాము) అతనితో చెప్పెను".

అపొ. 7:5 "ఆయన (యెహోవా) ఇందులో అతనికి పాదము పట్టునంత భూమినైనను స్వాస్థ్యముగా ఇయ్యక, అతనికి కుమారుడు లేనప్పుడు అతనికిని, అతని తరువాత అతని సంతానమునకును దీనిని స్వాధీనపరతునని అతనికి వాగ్దానము చేసెను".

హెబ్రీ. 11:9,13, "విశ్వాసమునుబట్టి అతడును, అతనితో ఆ వాగ్దానమునకు సమాన వారసులైన ఇస్సాకును, యాకోబు అనువారును గుడారములలో నివసించుచు, అన్యుల దేశములో వున్నట్టుగా వాగ్దత్త దేశములో పరవాసులైరి. వీరందరు (అబ్రాహాము సంతతివారు) వాగ్దానముల ఫలము అనుభవింపక పోయినను, దూరము నుండి చూచి వందనము చేసి, తాము భూమి మీద పరదేశులమును, యాత్రికులమునై యున్నామని ఒప్పుకొని, విశ్వాసముగలవారై మృతినొందిరి".

**జవాబు :** స్వాస్థ్యముగాను స్వాధీనముగాను ఇచ్చెను. కొందరైతే విశ్వాసహీనులై మృతిపొందిరి. రోమా 14:16, "దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు". అనగా శరీరేచ్ఛలతో కూడినది కాదని అర్థము. అయితే అబ్రాహాము గాని అబ్రాహాము వంశస్థులైన యాకోబు సంతతివారుగాని కేవలం అవిశ్వాస పూరితమైన సణుగుళ్ళ చేతను, గర్వము చేతను, దేవుని యొక్క స్వాస్థ్యమను కనానులో ప్రవేశింపలేక ఫిలిష్తీయులకు ఐగుప్తీయులకు బానిసలై, దేవుని స్వాస్థ్యమును, కనానులో ప్రవేశించు యోగ్యతను పోగొట్టుకొని నట్లు మనము గ్రహించ వలసియున్నది. ఏనాటికైనను నరుడు పరదేశి. అనగా ఒకనాటికి ఈ లోకమును వదలి వెళ్ళవలసిన వాడని అర్థము. ఎందుకనగా మనకు తండ్రి దేవుడు. ఆయన మీద తిరుగుబాటు చేసి మనం ఆయన స్వాస్థ్యమును పొందవలె నంటే జరిగే విషయం కాదు. ఎందుకంటే మన తండ్రియే మన క్రియలచేత దూరమై యున్నప్పుడు ఆస్థిలో హక్కుయు న్నదని అడుగుటలో ఎంత అర్థముందో ఇది కూడ అంతియే.

# North East West South వార్తలు

## ద్వంద ప్రమాణాలు పాటిస్తున్న బ్రిటన్

క్రైస్తవుల మనోభావాలను మాత్రమే కాక మత విశ్వాసాలకు గొడ్డలి పెట్టువంటి డావిన్సికోడ్ సినిమాను తమదేశంలో నిరభ్యంతరంగా ప్రదర్శించవచ్చని ప్రకటించిన బ్రిటీష్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ప్రపంచ వ్యాప్తంగా దొంగబాబాలు, గురువుల నిజస్వరూపాన్ని ప్రజలకు తెలియజేసే యధార్థ చైతన్యమాలికగా వున్న 'ది లవ్ గురు' అనే సినిమాను విడుదల చేయమని బ్రిటీష్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది.

'ది లవ్ గురు' అనే హాలివుడ్ సినిమాలో హిందువులను కించపరచే సన్నివేశాలున్నాయని హిందూ జాగృతి సమితి తమకు లేఖ రాసిందని బి.ఎఫ్.ఐ తెలిపింది. కేవలం హిందూ మనోభావాలు దెబ్బతింటున్నాయని ప్రదర్శన నిలిపివేశారు. అయితే ఈ సినిమా ప్రదర్శిస్తున్న నగరాల్లో ఎక్కడా హిందువులు నిరసన ప్రదర్శనలు చేయకపోవడం గమనార్హం.

## కేరళలో దొంగస్వామి అరెస్టు

కోచి : కేరళలోని వివాదాస్పద స్వామిజి అమృతా చైతన్యను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. యు.పి.లో వుండే భారత మహిళ సెరాఫిన్ ఎడ్విన్‌ను మోసగించి 45 లక్షల రూపాయలు తీసుకున్నాడనే కేసుతో పాటు మరో రెండు కేసులు స్వామిజిపై నమోదై ఉన్నాయి. దీంతో ఆయనకు వ్యతిరేకంగా ఇంటర్‌పోల్ నోటీసు జారీచేసింది. అరస్టైన స్వామీజీ ఆ తరువాత రివాల్వర్‌తో పోలీస్ స్టేషన్‌లో వీరంగం సృష్టించారు.

## కర్నాటకలో క్రైస్తవుల ఓట్ల గల్లంతు

(స్పెషల్ ఇంటర్వ్యూ) : కర్నాటకలో జరిగిన ఎన్నికలలో వెలుగుచూడని ఒక భయంకరమైన సత్యము ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్రైస్తవ కుటుంబములో ఐదు ఓట్లు వుంటే మూడు ఓట్లు, ఎనిమిది ఓట్లు వుంటే ఐదు ఓట్లు గల్లంతైనట్లు క్రైస్తవులు హన్నాకృపకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కేవలం లౌకిక పార్టీలు రాజ్యాధికారం చేయకూడదని మత తత్వ రాక్షసవాద పార్టీలు ఒక పథకం ప్రకారం క్రైస్తవుల ఓట్ల పట్టికలో నుండి తొలగించుటకు కుట్ర పన్నినట్లు తెలిపారు. అంతేకాక తమకు మాత్రమే ఓటు వేయాలని, కొన్నిచోట్ల అయితే మతతత్వపార్టీ పాస్టర్ల సదస్సు నిర్వహించి 2,500/- కానుకగా ఒక మతతత్వ పార్టీ డబ్బులు పంచింది.

## అమెరికాలో హిందూ పూజారి అరెస్ట్

ఏదేశ మేగినా ఎందుకాలిడిన పొగడరా నీ తల్లి భూమి భారతిని అన్నాడో కవి. దీనిని అక్షరసత్యంగా నెరవేరుస్తూన్నాడీ 79 సం॥రాల ప్రకాశానంద సరస్వతి. వివరాల్లోకి వెళ్తే అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని బర్సానాలో ఆశ్రమం కలిగియున్న ప్రకాశానంద సరస్వతి అలియాస్ శ్రీ స్వామీజీపై ఇద్దరు అమ్మాయిలు లైంగిక వేదింపుల కేసును నమోదు చేశారు. 93లోను ఆ తరువాత 96లోను, గత సంవత్సరంలోను కేసులు నమోదయ్యాయి. గతవారం వాషింగ్టన్ డి.సి. విమానాశ్రయంలో పోలీసులు స్వామీజీని అరెస్ట్ చేశారు. ఒక మిలియన్ డాలర్ల పూచికత్తుపై బెయిల్ మంజూరు చేసి ఆపై విడుదల చేశారు. (టైమ్స్‌నౌ 18:19 బులిటెన్ న్యూస్)